తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : గడ్డం నారాయణ
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శనివారం
21 డిసెంబర్ 2024
సంపుటి : 02
సంచిక : 183
పేజీలు : 12
వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna






# దోపిడీ కోసం తెచ్చిందే ధరణి

- రాష్ట్ర భూ వివరాలన్నీ దేశాలు దాటించారు
- అర్ధరాత్రుళ్లు అక్రమ రిజిస్ట్రేషన్లు విదేశాల నుంచి చేశారు
- యాజమాన్య హక్కుల కోసమే భూ భారతి
- కేసీఆర్, కేటీఆర్ దీనికి బాధ్యులు
- వారిని వదిలేది లేదు : అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ తరంగాలు

భూ యజమానుల హక్కులు కాపాడేందుకే తెలంగాణ భూ భారతి (భూమిపై హక్కుల రికార్డు) బిల్లు-2024ను తీసుకొచ్చామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీలో ఈ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ భారతి ప్రాధాన్యతను వివరిస్తూనే, -మిగతా 2 లో



## ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

- లోక్‌సభలో 20, రాజ్యసభలో 19 రోజులు కార్యకలాపాలు
- రెండింటిలోనూ కలిపి కొత్తగా ఏడు బిల్లులకు ఆమోదం
- వాయిదాలు..అంతరాయాలతో విలువైన సమయం వృధా

తరంగాలు న్యూఢిల్లీ

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. నవంబర్ 25న ఈ సమావేశాలు ప్రారంభమైన విషయం విదితమే. మొత్తం 26 రోజులకుగానూ.. లోక్‌సభలో 20 రోజులు, రాజ్యసభలో 19 రోజులు కార్యకలాపాలు జరిగాయి. పార్లమెంట్ ముగిసిన అనంతరం -మిగతా 2 లో



## ఫార్ములా-ఈ కార్ రేస్‌పై కొరడా

- కేటీఆర్, మరో ఇద్దరిపై కేసులు
- పీఎంఎల్‌ఏ, ఫెమా చట్టాల ఉల్లంఘన కింద అభియోగాలు
- ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా నమోదు

హైదరాబాద్

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మరో ఇద్దరిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు కేసులు నమోదు చేశారు. ఫార్ములా-ఈ -మిగతా 2 లో




## 30 వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దు

- దర్యాప్తునకు సహకరించాలి
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్‌తరంగాలు

ఫార్ములా ఈ-రేస్ అక్రమాలపై ఏసీబీ నమోదు చేసిన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి, కె.తారకరామారావును ఈనెల 30వ తేదీ వరకు అరెస్ట్ చేయరాదని హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేటీఆర్ ఏసీబీ దర్యాప్తునకు సహకరించాలనీ, ఆయన వద ఉన్న డాక్యుమెంట్స్ ఏసీబీ దర్యాప్తు అధికారులకు -మిగతా 2 లో

# అసెంబ్లీలో కారు రేసు



- శాసనసభలో బీఆర్ఎస్ సభ్యుల నిలదీత
- అరుపులు..చించివేతలు..హెచ్చరికలు
- వెల్‌లోకి దూసుకెళ్లిన సభ్యులు
- మార్షల్స్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య తోపులాట
- స్పీకర్ చైర్‌పైకి పేపర్లు చింపి విసిరేసిన కౌశిక్‌రెడ్డి, వివేకానంద
- మంత్రి పొంగులేటి స్థానం వైపు దూసుకెళ్లేందుకు యత్నం
- పలుమార్లు సభ వాయిదా

తరంగాలు-హైదరాబాద్

ఫార్ములా వన్ ఈ-కార్ రేస్‌కు సంబంధించి అసెంబ్లీలో చర్చించాల్సిందే నంటూ బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. దీంతో శుక్రవారం శాసనసభలో తీవ్ర గందరగోళం, అంతకుమించిన ఉద్రిక్తత చోటు చేసుకున్నది. 'భూ భారతి బిల్లు రాష్ట్ర ప్రజలకు ఎంతో కీలకమైంది, దానిపై ముందుగా చర్చిద్దాం అంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వారించినా..వారు వెనక్కి తగ్గకపోవటంతో పలుమార్లు సభ వాయిదా పడింది. 'గవర్నర్ అనుమతినిచ్చిన తర్వాత సభలో ఈ కార్-రేసుపై చర్చించే వీలులేదు.. కేసు ఏసీబీ పరిధిలో ఉంది కాబట్టి అసెంబ్లీలో చర్చించటం సాధ్యం కాదు ' అని కాంగ్రెస్ సభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి విడమరిచి చెప్పినా బీఆర్ఎస్ సభ్యులు తమ నినాదాలను ఆపకపోవటంతో -మిగతా 2 లో



## అడ్డగోలుగా భూ దోపిడీ

- లోపాలు బయటకు రాకుండా రోజుకో డ్రామా
- అసెంబ్లీలో రౌడీలు, గుండాల్లా ప్రవర్తిస్తున్నారు బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి గరంగరం
- కొల్లగొట్టిన భూములు తిరిగి పేదలకు పంచుతామని వెల్లడి
- 'భూభారతి -2024 రెవెన్యూ చట్టం'పై అసెంబ్లీలో చర్చ

హైదరాబాద్

కొత్త రాష్ట్రాన్ని కాపాలా కుక్కల్లా కాపాడుతామంటూ చెప్పిన బీఆర్ఎస్ నేతలు అధికారంలోకి వచ్చాక వేట కుక్కల్లా మారి భూదోపిడీకి పాల్పడ్డారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వారు అందినకాడికి దోచుకున్నారని ఆరోపించారు. ఈ దోపిడీపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామని ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శాసనసభలో భూభారతి -మిగతా 2 లో



## రాజస్థాన్‌లో ఘోర అగ్ని ప్రమాదం

- 11 మంది మృతి.. 40 మందికి పైగా గాయాలు
- 28 మంది పరిస్థితి విషమం.. ఆస్పత్రిలో చికిత్స
- మృతుల కుటుంబాలకు రాష్ట్రపతి, ప్రధాని సంతాపం
- పెట్రోల్ పంపు బయట ట్రక్కు బీభత్సంతో ఘటన

జైపూర్

రాజస్థాన్‌లో దారుణం చోటు చేసుకున్నది. జైపూర్‌లోని ఓ రహదారిపై ట్రక్కు బీభత్సం సృష్టించటంతో అక్కడ భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. మంటలు పెట్రోల్ బంకుకూ వ్యాపించాయి. ఈ ఘటనలో 11 మంది -మిగతా 2 లో

## అవినీతే జరగని చోట ఏసీబీకి పనేంటి?

- సీఎం రేవంత్ రెడ్డిది తప్పుడు ప్రచారం
- ఫార్ములా ఈ రేస్‌తో లాభాలొస్తే కేసులు పెడతారా?
- హైకోర్టు ఉత్తర్వుల పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు హర్షం

హైదరాబాద్‌తరంగాలు

ఫార్ములా ఈ రేస్ ఒప్పందంపై సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఫార్ములా ఈ రేస్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ రూపంలో -మిగతా 2 లో



# దోపిడీ కోసం తెచ్చిందే ధరణి

(మొదటి తరువాయి)

బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి' వెబ్ పోర్టల్ కుంభకోణాన్నీ వివరించారు. భూములకు సంబంధించిన చర్చను అసెంబ్లీలో చేపట్టడం ద్వారా రాష్ట్ర రైతాంగానికి మేలు జరగాలని తాము భావిస్తున్నామన్నారు. దానికోసమే పటిష్టమైన చట్టాన్ని తెస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీ అహంభావం, అహంకారంతో అసెంబ్లీలో ఈ చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందని విమర్శించారు. తెలంగాణలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అనేక పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు. రావి నారాయణ రెడ్డి, అరుట్ల కమలాదేవి, అరుట్ల రాంచంద్రారెడ్డి, మల్లు స్వరాజ్యం, భీం రెడ్డి నర్సింహారెడ్డి, చిట్యాల ఐలమ్మ వంటి వారు భూమి కోసమే పోరాటాలు చేశారన్నారు. వారు భూమిని ఆత్మగౌరవంగా, హక్కుగా భావించి సాయుధ రైతాంగ పోరాటం చేశారని వివరించారు. పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దుకు కొంతమంది భూమిపై ఆధిపత్యం చలాయించడమే కారణమని చెప్పారు. భూమిలేని పేదలకు అసైన్డ్ పట్టాలు ఇచ్చి ఇందిరాగాంధీ పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారనీ, నిజమైన భూ యజమానుల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. మాజీ సీఎం కే చంద్రశేఖరరావు (కేసీఆర్) తన మెదడును రంగరించి ధరణి పేరుతో అద్భుత చట్టాన్ని తీసుకొస్తున్నామని చెప్పారని ఎద్దేవా చేశారు. 2010లోనే ఒడిస్సా ప్రభుత్వం 'ఈ-ధరణి' పేరుతో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి అప్పగించిందనీ, అనుభవం, నైపుణ్యం లేని సంస్థకు 'ఈ-ధరణి' పోర్టల్‌ను ఇవ్వడాన్ని 2014లో కాగ్ తప్పుపట్టిందని వివరించారు. అలాంటి లోపభూయిష్టమైన ధరణిని కేసీఆర్ తెలంగాణ ప్రజలపై ఎందుకు బలవంతంగా రుద్దారో చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

**ఇదీ ధరణి భాగోతం**

2018లో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థతో పాటు గాదె శ్రీధర్‌కు చెందిన ఈ సెంట్రిక్, విస్సెన్ ఇన్ఫోటెక్ సంస్థలు సంయుక్తంగా కాంట్రాక్టు సాధించుకున్నాయనీ, క్రిమినల్ నేపథ్యం ఉన్న కంపెనీలను టెండర్లలో నిషేధించే విధానం ఉన్నా, అప్పటి సీఎం కేసీఆర్ ఆ పని చేయలేదన్నారు. భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి అన్ని రకాల బాధ్యతలు ఆ కంపెనీకి అప్పగించారనీ, ఆ తర్వాత ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సబ్సిడరీ కంపెనీ అయిన 'టెరాసిస్' ధరణి కాంట్రాక్టును దక్కించుకుందన్నారు. ఈ కంపెనీలో 99 శాతం షేర్లను ఫిలిప్పిన్స్ దేశానికి చెందిన ఫాల్కన్ ఎస్‌జీ అనే సంస్థ రెండు దఫాలుగా 2021లో కొనుగోలు చేసిందనీ, మిగిలిన ఒక్క శాతం వాటా మాజీ మంత్రి కేటీఆర్ మిత్రుడు గాదె శ్రీధర్‌రాజు కొనుగోలు చేశారని ఆరోపించారు. ఆ ఒక్క శాతం షేరుతో శ్రీధర్ రాజు టెరాసిస్‌కు సీఈవోగా అవతారం ఎత్తారని వివరించారు. ఆ తర్వాత ఫాల్కన్ ఎస్‌జీ (ఫిలిప్పిన్స్) సంస్థలోని వంద శాతం షేర్లను సింగపూర్‌కు చెందిన ఫాల్కన్ ఇన్వెస్టిమెంట్స్ (సింగపూర్) అనే సంస్థ కొనుగోలు చేసింది. దీనిలో వందశాతం వాటాలను స్పారో ఇన్వెస్ట్‌మెంట్స్, జీడబ్ల్యూ స్కై, హిల్ బ్రూక్స్ ఇన్వెస్టిమెంట్స్, పారడిగ్మ్ ఇన్నోవేషన్స్, క్వాంటెలా ఐఎన్‌సీ, ఫాల్కన్ ఇన్వెస్ట్‌మెంట్స్ (సింగపూర్) అనే కంపెనీలు కొను గోలు చేశాయని తెలిపారు. ఆ తర్వాత స్పారో ఇన్వెస్ట్‌మెంట్స్ అనే సంస్థలో 100 శాతం వాటాలు గేట్‌వే ఫండ్-2 అనే కంపెనీ చేతుల్లోకి వెళ్లాయని చెప్పారు. ఆ కంపెనీ మూలాలు పన్ను ఎగవేతలు, ఆర్థిక నేరాలకు కేంద్రమైన సైమన్స్ ఐలాండ్ అనే దీవిలో ఉన్నాయనీ, హిల్ బ్రూక్స్ ఇన్వెస్టిమెంట్స్ సంస్థ మూలాలు కూడా పన్ను ఎగవేత, ఆర్థిక నేరాలకు నిలయమైన బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్స్‌లో ఉన్నాయని తెలిపారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న వారిలో ఎవరూ ఈ దేశానికి చెందిన వ్యక్తులు కాదనీ, అలాంటి వ్యక్తుల చేతుల్లోకి తెలంగాణ రైతుల భూముల వివరాలు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ¬

# ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

(మొదటి తరువాయి)

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, సహాయ మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్లమెంట్ పనితీరుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. లోక్‌సభలో 54.5 శాతం, రాజ్యసభలో 40 శాతం ఉత్పాదకత జరిగింది. కొత్తగా ఐదు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టగా లోక్‌సభలో నాలుగు, రాజ్యసభలో మూడు బిల్లులు ఆమోదం పొందాయి. భారతీయ వాయుయాన్ విధేయక్ బిల్లుకు ఉభయ సభల్లోనూ ఆమోదం లభించింది. 75 ఏండ్ల రాజ్యాంగంపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. అందులో స్మారక నాణెం, స్టాంప్, రెండు పుస్తకాలను విడుదల చేశారు. అలాగే, రాజ్యాంగంపై ఉభయ సభల్లోనూ చర్చ జరిగింది. లోక్‌సభలో 15.43 గంటల పాటు జరిగిన చర్చలో 62 మంది ఎంపీలు పాల్గొన్నారు. రాజ్యసభలో 17.41 గంటల పాటు జరిగిన చర్చలో 80 మంది సభ్యులు పాల్గొన్నారు. లోక్‌సభలో ప్రధాని మోడీ, రాజ్యసభలో కేంద్ర హౌం మంత్రి అమిత్ షా చర్చకు సమాధానమిచ్చారు. రాజ్యసభలో అమిత్‌షా చర్చకు సమాధానమిచ్చిన సందర్భంలో ఆయన అంబేద్కర్‌ను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీంతో, బీజేపీ ఆత్మరక్షణలో పడింది. అలాగే, 2024-25 సప్లిమెంటరీ డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌పై లోక్‌సభలో 7.21 గంటల పాటు చర్చ జరిగింది. సప్లిమెంటరీ డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌ను ఆమోదించారు. అలాగే వివాదాస్పద జమిలీ ఎన్నికల (ఒకే దేశం.. ఒకే ఎన్నిక)కు సంబంధించి రెండు రాజ్యాంగ సవరణ బిల్లులలో రాజ్యాంగ (129) సవరణ బిల్లును లోక్‌సభ, రాష్ట్రాలకు ఏకకాలంలో నిర్వహించడానికి, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టే ప్రయత్నం చేశారు. తగిన మెజారిటీ లేకపోవడంతో ఈ రెండు బిల్లులపై 39 మందితో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేశారు. అయితే ఈ పార్లమెంట్ సమావేశాలను అదానీ ముడుపుల వ్యవహారం, అంబేద్కర్‌ను అవమానిస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలతో పాటు ప్రభుత్వ వైఖరికి సంబంధించిన అంశాలు కుదిపేశాయి.

**అమిత్ షా వ్యాఖ్యలపై ప్రతిపక్షాల ఆందోళన**


శుక్రవారం లోక్‌సభ ప్రారంభం కాగానే జమిలీ బిల్లును జేపీసీకి పంపాలనే తీర్మానంపై లోక్‌సభ ఆమోదం తెలిపింది. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలపై ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. వారి ఆందోళన కొనసాగుతుండగానే స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఆ సమయంలో ప్రధాని కూడా సభలో ఉన్నారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ బిల్లుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జేపీసీలో 12 మంది రాజ్యసభ సభ్యులకు చోటు కల్పించాలని అర్జున్ మేఘ్వాల్ ప్రవేశపెట్టిన తీర్మానానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆ తర్వాత, అమిత్ షా వ్యాఖ్యలపై సభలో ప్రతిపక్ష ఎంపీలు నిరసనకు దిగడంతో రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేశారు.

## అడ్డగోలుగా భూ దోపిడీ

(మొదటి తరువాయి)

2024 రెవెన్యూ చట్టంపై చర్చలో మంత్రి మాట్లాడారు. ధరణితో ఎంతో మంది రైతుల జీవితాలు అతలాకుతల మయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు దొర చేస్తే శిక్ష అమాయక ప్రజలు ఎందుకు అనుభవించాలని ప్రశ్నించారు. ధరణిలోని లోపాలు, తద్వారా బీఆర్ఎస్ నేతల మోసాలు బయటకు రాకుండా ఉండేందుకు రోజుకో డ్రామా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అందులో భాగంగా శాసనసభలో రౌడీలు, గుండాల్లా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామనీ, ఆ తర్వాత ఎలాంటి విచారణ చేపట్టాలో ఆలోచిస్తామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో విసిరేశామన్నారు. బీఆర్ఎస్ నేతలు కొల్లగొట్టిన పేదల భుములను తిరిగి వారికి ఇస్తామన్నారు. సమాజంలో అట్టడుగు వర్గాలు మొదలుకుని భూయజమానులకు మేలు చేసేలా విస్తృత స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణతో రూపొందించిన భూ భారతి చట్టం అక్షరాలా భూ యజమానులకు చుట్టమని భరోసా ఇచ్చారు. ఇటు రాష్ట్రంలో, అటు దేశంలో 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకువచ్చిన రెవెన్యూ చట్టాలు, సంస్కరణలు రైతాంగానికే కాకుండా యావత్తు ప్రజానీకానికి ఎంతో మేలు చేశాయని చెప్పేందుకు గర్వపడుతున్నానని తెలిపారు. అదే నిబద్ధత, అదే ఆశ, ఆశయాలతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి 2024 రెవెన్యూ చట్టం నిజమైన ప్రజా చట్టం-అక్షరాలా భూమి ఉన్న ప్రతి ఒక్కరికి చుట్టమని వ్యాఖ్యానించారు. భూమి కోసం, భుక్తికోసం వేలాది పీడిత రైతులు, కూలీలు పాల్గొన్న తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో చారిత్రాత్మక ఘట్టమన్నారు. వేలాది పుస్తకాలు చదివిన అపర మేధావిగా, నయా నిజాంగా పేరు ప్రఖ్యాతులు పొందిన ధరణి సృష్టికర్తలు గత పదేండ్లుగా దుర్మార్గంగా వ్యవహరించారని కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. ధరణి సమస్యలను పరిష్కరించక లేకపోవడం, క్షేత్రస్థాయిలో బాధితుల బాధను అర్థం చేసుకోకుండా ధరణిలో ఎలాంటి సమస్యల్లేవంటూ బుకాయించడం బాధాకరమన్నారు.సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన దళిత రైతు మద్దెల కృష్ణయ్య (73) 35 ఏండ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఎం. విజేందర్‌రెడ్డి నుంచి ఏడెకరాల (సర్వేనెం.1452) భూమిని కొన్నారనీ, ధరణి వచ్చిన తర్వాత ఆ భూమి వేరే వాళ్ల పేరుపై పట్టాకావడంతో ఆయన మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితి ఇందిరమ్మ రాజ్యంలో మరొకరికి రాకుండా ఉండేలా భూభారతి చట్టాన్ని రూపొందించామని గుర్తు చేశారు. 'అధికార దర్పంతో గత ప్రభుత్వం ధరణి చట్టాన్ని తెచ్చి ప్రజల మీద రుద్దింది. గడీలో కూర్చొని రాత్రికిరాత్రి చట్టాన్ని రూపొందించింది. తప్పు చేసింది దొర.. శిక్ష అనుభవిస్తున్నది రైతులు. వారి బాధలను తొలగించేందుకే భూభారతిని తీసుకురాబోతున్నాం. ఆ బిల్లుపై చర్చ జరుగుతుంటే అడ్డుకోవాలని చూడటం దారుణం' అని బీఆర్ఎస్ నాయకులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను తీర్చేందుకు సభలో బిల్లుపై చర్చ నిర్వహిస్తోంటే బీఆర్ఎస్ సభ్యులు దుర్మార్గంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు.

# రాజస్థాన్‌లో ఘోర అగ్ని ప్రమాదం



(మొదటి తరువాయి)

ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. వారిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నది. పదుల సంఖ్యలో వాహనాలు దగ్ధమయ్యాయి. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్-అజ్మీర్ హైవే వద్ద ఓ పెట్రోల్ పంపు బయట సీఎన్‌జీ ట్యాంకర్ పార్క్ చేసి ఉన్నది. వేగంగా వచ్చిన ఓ ట్రక్కు ఇతర వాహనాలను ఢ కొనటంతో సీఎన్‌జీ ట్యాంకర్‌కు మంటలు అంటుకున్నాయి. మంటలు ఉవ్వెత్తున ఎగిసి అది కాస్తా పెట్రోల్ బంకుకు వ్యాపించాయి. ఈ మంటల్లో 30 ట్రక్కులతో పాటు మరిన్ని వాహనాలు దగ్ధమైనట్టు సమాచారం. ఉదయం 5.30 గంటలకు ఈ ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ఘటనలో 11 మంది చనిపోయారు. 40 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో 28 మంది పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందగానే 20 అగ్నిమాపక యంత్రాలతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో బంకు నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. పెద్ద ఎత్తున పొగ కమ్ముకున్నది. పేలుడు శబ్దం పది కిలోమీటర్ల దూరం వరకు వినబడినట్టు స్థానికులు చెప్తున్నారు. వాహనాలను ఢకొట్టిన ట్రక్కులో మండే రసాయనాలు ఉన్నట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. బాధితులను దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేంద్ర హౌం మంత్రి అమిత్ షా, సీఎంతో ఫోన్లో ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద ఘటనపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ స్పందించారు. జైపూర్ అగ్నిప్రమాద ఘటన చాలా బాధాకరమని రాష్ట్రపతి అన్నారు. బాధిత కుటుంబాలకు రాష్ట్రపతి, ప్రధాని సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున మోడీ ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు.

## ఫార్ములా-ఈ కార్ రేస్‌పై కొరడా

(మొదటి తరువాయి)

కార్ రేసుకు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ), విదేశీ మారక ద్రవ్య నియంత్రణ చట్టా (ఫెమా)ల కింద వీరిపై ఈసీఐఆర్‌ను శుక్రవారం రాత్రి ఈడీ నమోదు చేసింది.అంతకుముందు, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఉదయం ఈడీ అధికారులు ఆ విభాగానికి లేఖ రాసి తెప్పించుకున్నారు. పది పేజీల ఎఫ్ఐఆర్‌తో పాటు దానికి సంబంధించిన ఆధార పత్రాలను కూడా ఈడీ అధికారులు తెప్పించుకొని క్షుణ్ణంగా పరిశీలించి పీఎంఎల్ఏ, ఫెమాల ఉల్లంఘనలు జరిగినట్టు నిర్ధారణకు వచ్చారని తెలిసింది. ముఖ్యంగా, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి లండన్‌లోని ఎఫ్ఈఓ, ఎస్‌నెక్ట్స్ కంపెనీలకు రూ.54 కోట్లను హెచ్ఎండీఏ ద్వారా ఏ విధంగా బదిలీ చేశారు? హిమాయత్‌నగర్‌లోని ఐఓబీ బ్యాంకు బ్రాంచ్ నుంచి సదరు కంపెనీలకు డాలర్ల రూపంలో డబ్బు మార్పిడి ఏ విధంగా జరిపారు? అందుకు చట్టబద్ధమైన నిబంధనలను ఏ మేరకు పాటించారు? అనే తదితర కోణాల్లో కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను విచారించటానికి ఈడీ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం అవసరమైన నోటీసులను సదరు నిందితులకు పంపించటానికి ఇప్పటికే ఈడీ ఏర్పాట్లను పూర్తి చేసినట్టు సమాచారం

## 30 వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దు

(మొదటి తరువాయి)

ఇవ్వాలని ఆదేశించింది. కొన్ని లోపాలు ఎఫ్ఐఆర్‌లో ఉన్న కారణంగా పిటిషనర్‌ను అరెస్టు చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు స్పష్టం చేసింది ఏసీబీ, ఫిర్యాదుదారు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్‌లు కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులిచ్చింది. విచారణను ఈ నెల 27కు వాయిదా వేస్తూ జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీబీ పెట్టిన కేసును కొట్టేయాలంటూ కేటీఆర్ లంచ్‌మోషన్ పిటిషన్ వేశారు. దీని తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం వాదిస్తూ, ఫార్ములా రేస్ వల్ల హైదరాబాద్ పేరు ప్రఖ్యాతలు విశ్వవ్యాప్తం అయ్యాయని చెప్పారు. దేశంలోనే తొలిసారి హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేసింగ్ జరిగిందన్నారు. రూ.700 కోట్ల మేరకు రాష్ట్రానికి లబ్ది చేకూరిందన్నారు. రూ.110 కోట్ల మేరకు లాభం వచ్చిందన్నారు. ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుని ఫార్ములా రేసింగ్ కోసం ఒప్పందం చేసుకుందనీ, ఆర్థికంగా బిల్లులు పొందిన ప్రమోటర్స్‌ను కేసులో చేర్చకుండా అవినీతి జరిగిందని ఎఫ్ఐఆర్ నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతి జరిగిందని చెబుతున్న వాళ్లు ఫార్ములా రేసింగ్ నిర్వహించిన సంస్థను ఎందుకు కేసులో చేర్చలేదని ప్రశ్నించారు. సీజన్ నైన్ వల్ల ఎన్నో ఆర్థిక, పర్యాటక, ఇతర ప్రయోజనాలు లభించాయని చెప్పారు. ఈ దశలో ఒప్పందం చేసుకున్న వాళ్లలో స్పాన్సర్స్ వెళ్లిపోవడంతో ప్రభుత్వమే ఆ బాధ్యతలు తీసుకుని డబ్బులు చెల్లించిందన్నారు. రెండు విడతల చెల్లింపులు చేశాక కొత్త ప్రభుత్వం చివరి విడత చెల్లించకపోవడంతో సీజన్ టెన్ రద్దయ్యిందన్నారు. దీని వల్ల ఆర్బిట్రేషన్ సమస్యను కూడా ప్రభుత్వం కొని తెచ్చుకుందన్నారు. విధానపరమైన నిర్ణయం తీసుకుంటే అవినీతి జరిగిందని ఎలా చెబుతారని ప్రశ్నించారు.

## అసెంబ్లీలో కారు రేసు..

(మొదటి తరువాయి)

స్పీకర్ వారిపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ గందరగోళం మధ్యే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 'భూ భారతి' బిల్లుపై చర్చను ప్రారంభించి, ప్రసంగించారు. శాసనసభ శీతాకాల సమావేశాల ఆరో రోజైన శుక్రవారం ఉదయం 10 గంటలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సభ ప్రారంభమైంది. అత్యంత కీలకమైన భూ భారతి బిల్లుపై చర్చించేందుకు వీలుగా ప్రశ్నోత్తరాలను రద్దు చేసిన ఆయన నేరుగా బిల్లుపై చర్చను ప్రారంభించాలంటూ మంత్రి పొంగులేటికి సూచించారు. ఈ దశలో స్పీకర్ అనుమతితో బీఆర్ఎస్ సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు జోక్యం చేసుకుంటూ.. ఫార్ములావన్ ఈ-కార్ రేసుపై అసెంబ్లీలో చర్చించటం ద్వారా ప్రజలకు వాస్తవా లను తెలపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ రేసులో ఎలాంటి అవకతవకలు, అవినీతి జరగ లేదంటూ ఆయన స్పష్టం చేశారు

## అవినీతే జరగని చోట ఏసీబీకి పనేంటి?ం

(మొదటి తరువాయి)

లాభాలొచ్చాయని చెప్పారు. ప్రభుత్వాలకు లాభాలు తెచ్చినందుకు కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. అసలు అవినీతే జరగలేదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారనీ, ప్రొసీజర్ ల్యాప్స్ జరిగి ఉండొచ్చన్నారని తెలిపారు. అవినీతి జరగని దాంట్లో ఏసీబీతో ఎలా విచారణ జరుపుతారని ప్రశ్నించారు. హైకోర్టు అరెస్టు చేయొద్దని ఇచ్చిన ఉత్తర్వులతో కేటీఆర్ నైతిక విజయం సాధించారని తెలిపారు. తాము కేసు పెట్టవద్దనీ కోరలేదనీ, అసెంబ్లీలో చర్చించాలని కోరినట్టు స్పష్టం చేశారు. చర్చకు ఎందుకు ఒప్పుకోలేదు? ప్రజలకు వాస్తవాలు తెలియొద్దా? అని నిలదీశారు. ఫార్ములా ఈ రేస్‌లో రూ.600 కోట్ల అవినీతి అంటూ సీఎం అసత్యాన్ని చెప్పే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. మిగిలిన 50 శాతం చెల్లించకపోవడం వల్లే రద్దు చేసుకుంటున్నామని సదరు సంస్థ చెప్పిందని గుర్తుచేశారు. 45 లక్షల పౌండ్స్ అంటే సుమారు రూ. 47 కోట్లు అని, రేవంత్‌రెడ్డి రూ.600 కోట్ల నష్టమంటూ శుద్ధ తప్పులు చెప్పారని తెలిపారు. వాస్తవానికి రాష్ట్రానికి ఈ రేస్‌తో రూ. 700 కోట్ల లాభం వచ్చిందని స్పష్టం చేశారు. ఫార్ములా ఈ రేస్‌తో హైదరాబాద్‌కు రూ. 600-700 కోట్ల మేలు జరిగిందని ప్రఖ్యాత సంస్థ నీల్సన్ 2022లో తెలిపిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి తుగ్లక్ పనుల వల్ల రూ.700 కోట్ల నష్టం జరిగిందని విమర్శించారు. రాష్ట్ర ఖజానా నుంచి, నేషనల్ బ్యాంకు నుంచి ఆ సంస్థకు డబ్బులు పంపించారనీ, ఇందులో అవినీతి ఏముంటుందని ప్రశ్నించారు. వస్తు, ధన రూపేనా అవినీతి జరిగితే ఏసీబీకి పనుంటుందనీ, అలాంటిదేమి లేకుండా ఏసీబీ ఏం చేస్తుందని సందేహం వ్యక్తం చేశారు. రూ.42 కోట్లతో తమిళనాడులో ఫార్ములా 4, ఉత్తర్ ప్రదేశ్ రూ.1700 కోట్లతో ఫార్ములా వన్, రూ.103 కోట్లతో చంద్రబాబు 2003లో ఆఫ్రో ఏషియన్ గేమ్స్ నిర్వహించారని తెలిపారు. కాంగ్రెస్ ఢిల్లీలో కామన్ వెల్త్ గేమ్స్ రూ.70 కోట్లతో నిర్వహించడం ఒక స్కాం అని విమర్శించారు.

తరంగాలు Tharangalu Daily News Paper RNI : TELTEL / 2022 / 83463

# పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించొద్దు





**-వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్ ప్రతినిధి , 20డిసెంబర్,తరంగాలు:** పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే రీతిలో స్టేషన్ అధికారులు వ్యహరించవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం చిల్పూర్ పోలీస్ స్టేషన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు.శుక్రవారం ఉదయం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు పోలీస్ అధికారులు మొక్కలను అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు.ముందుగా పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పోలీస్ శాఖ మంజూరు చేసిన కిట్ ఆర్టికల్స్ ను పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు వచ్చిన



ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.అలాగే పెండింగ్ కేసులు,నిందితుల అరెస్ట్,రౌడీ షీటర్ల వివరాలు,రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు,వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టరును అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీంచారు.అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకై రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని,అలాగే ట్రాన్స్ఫార్మ్ దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని,పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని,సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలని సూచించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాలని,ప్రజలకు పోలీసులపై వున్న నమ్మకానికి తగ్గటుగానే పోలీసులు నిజాయితీతో పని చేయాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. చివరగా పోలీస్ కమిషనర్ చేతులమీదుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.ఈ తనిఖీల్లో ఎఎస్పీ మానాన్ భట్,ఘనపూర్ ఏసీపీ భీం శర్మ,సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,ఎస్ఐ నవీన్ కుమార్ తోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే నన్నపనేని వ్యాఖ్యలు విడ్డూరం

**-మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ భూమి పూజలో పాల్గొనడం కాశిబుగ్గ ప్రజలకు దుర్ధినం**
**-బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ**

**వరంగల్ తూర్పు,20డిసెంబర్, తరంగాలు:** మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ గురువారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి మాట్లాడడం విడ్డూరంగా వుందని, సామెతలు,పొడుపు కథలు బ్రహ్మాండంగా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ అన్నారు. శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ అజంజాహి మిల్ కార్మికుల యూనియన్ బిల్డింగ్ ఇంటి నంబర్ ను మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మేయర్ గా ఉన్న సమయంలోనే రద్దు



చేయించాడని,మాంగళ్య షాపింగ్ మాల్ కు మధ్యవర్తిగా వ్యవహరించింది కూడా ఆయనే అని ఆరోపించారు.ఆయన మేయర్ గా వున్న సమయంలోనే కార్పొరేషన్ కార్యాలయం నుండి కార్మికుల యూనియన్ బిల్డింగ్ పత్రాలు మాయమయ్యాయని ఆరోపించారు. అజంజాహి మిల్స్ యూనియన్ ఎంవీఆర్ఎస్ కార్యకలాపాలను పోలీసులను అడ్డుకొని యూనియన్ ను విచ్చినం చేయడానికి కుట్ర చేసింది మాజీ ఎమ్మెల్యే, మాజీ మేయర్ నరేందర్ పుష్ప 1 గా వ్యవహరించిచారని, పుష్ప 2 గా మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళీ వ్యవహరించి,జిల్లా లీగల్ సెల్ అథారిటీలో కేసును రాజీ కుదిర్చింది పుష్ప 1 అని అన్నారు.లీగల్ సెల్ అథారిటీ 2024 ఆగష్టు లోనే రాజీ కుదిర్చింది,కాసం షాపింగ్ మాల్ యజమాని మోకా మీదకు వచ్చారని, కొండా మురళీ భూమి పూజ చేయడానికి రావడంతో కాశీబుగ్గ ప్రజలకు,కార్మిక లోకానికి అదొక దుర్ధినమని అన్నారు.మాజీ మేయర్,మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ కారణంగానే అజంజాహి మిల్ యూనియన్ కార్మికులు గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణలు చెప్పాలి

**-వర్ధన్నపేటలో అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం చేసిన మాల మహానాడు నేతలు**



**వర్ధన్నపేట,20డిసెంబర్, తరంగాలు:** కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణలు చెప్పాలని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె రమేష్ డిమాండ్ చేశారు.శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి,కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం సహా ప్రపంచ దేశాలు ఎంతగానో గౌరవించే అంబేద్కర్ పట్ల అమిత్ షా అగౌరవపరిచే విధంగా ప్రస్తావించడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.దేశ ప్రధాని,బీజేపీ జాతీయ అధ్యక్షులు,కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా బేషరతుగా అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు అంబేద్కర్ వాదులకు దళిత సంఘాల నేతలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు బెజ్జం పాపారావు, బంగారు సదానందం,రవి,బందెల ప్రవీణ్,బొగ్గుల కొమ్మాలు,స్వామి, లింగాల రంజిత్,కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఇరానీ కేఫ్ ప్రారంభించిన రామానంద్



**నర్సంపేట డిసెంబర్ 20 తరంగాలు:** నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఎస్కే షఫీ కి సంబంధించిన ఇరానీ కేఫ్ ను టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామానంద్ ను కేఫ్ యాజమాన్యం శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మసూద్ భాయ్ నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పంబి వంశీకృష్ణ, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు డిష్ బాబా, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆయుబ్ భాయ్, సీనియర్ నాయకులు బీరం భరత్ రెడ్డి, మురళి చిప్ప నాగ, నాంపల్లి వెంకటేశ్వర్లు, కొప్పు అశోక్, గద్ద అఖిల్, దేశి సాయి పటేల్, మనోజ్ కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ని కలిసిన నూతన అసోసియేషన్ సభ్యులు



**పటాన్ చెరువు డిసెంబర్ 20 ( తరంగాలు )** పటాన్ చెరువు ఎమ్మెల్యే ను కలిసిన డబల్ బెడ్ రూమ్ డిగ్నిటీ హౌసింగ్ సొసైటీ సెక్టార్ ఒకటి ఎన్నికల్లో గెలిచిన కార్యవర్గం.కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం పటాన్ చెరువు నియోజకవర్గం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి అసోసియేషన్ ఎన్నికల్లో గెలిచినందుకు ఎమ్మెల్యే ఆశీర్వాదాలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గెలిచిన అధ్యక్ష కార్యదర్శులకు కార్యావర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఎప్పుడు ఏలాంటి సమస్యలు వచ్చినా ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు అందిస్తానని నూతన అసోసియేషన్ కార్యవర్గానికి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అసోషియేషన్ నాయకులు స్థానిక నాయకులు, డబల్ బెడ్ రూమ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 29న ఆర్యవైశ్య సంఘంమండలశాఖ ఎన్నికలు


**జఫర్గడ్ డిసెంబర్20(తరంగాలు):** మండలశాఖ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు ఈ నెల 29న జరుగనున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రేవూరి రమేష్ తెలిపారు.స్థానిక మండల ఆర్యవైశ్య సంఘం హాలులో శుక్రవారం జరిగిన ఆర్యవైశ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుచూజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గంగిశెట్టి ప్రమోద్ కుమార్ ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకునేందుకు ఈ నెల 29న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ నెల 25న నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారుసేవా థృక్పదం గల అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేయవచ్చునని రమేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమిటీ చైర్మన్ గందె సోమన్న , మండలశాఖ కార్యదర్శి బోనగిరి శ్రవణ్ కుమార్ ,కోశాధికారి దొడ్డ రమేష్ . జిల్లా డైరెక్టర్ దామశెట్టి సోమేశ్వర్ దితరులు పాల్గొన్నారు.

# మైక్రో బయాలజీ లో పిట్టల నీరజకి డాక్టరేట్



**వరంగల్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 20,(తరంగాలు)** చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్సిటీ)మైక్రో బయాలజీ విభాగం పరిశోధకురాలు పిట్టల నీరజకు డాక్టరేట్ సాధించినట్లు ప్రకటించారు.ఈ మేరకు చైతన్య యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ యం జగదీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జ్యోతి సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ లభించింది.బి శ్రీలత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.నీరజకు ఇప్పటివరకు అంతర్జాతీయ పరిశోధన పత్రాలను సమర్పించారు. ఇంకా పెటే కలిగి ఉన్నారు. నీరజ కు అధ్యాపకులు పరిశోధకులు,కుటుంబ సభ్యులు అభినందించారు.


# నూతన వధూవరులను ఆశీర్వదించిన పలువురు నాయకులు



**జఫర్గడ్ డిసెంబర్ 20(తరంగాలు):** తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోడలు కపిరాజు కూతురు వివాహ మహెూత్సవం హన్మకొండ లోని ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగింది. ఈ వివాహ మహెూత్సవానికి స్టేషన్ ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుజ్జరి రాజు, జఫర్గడ్ పాక్స్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అన్నెపు అశోక్, గాదేపాక అయోధ్య,గండి రమేష్ హాజరై నూతన వరూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# తండ్రిని కోల్పోయిన పేద విద్యార్థికి వ్యాక్ ఫౌండేషన్ చేయూత

**-ఆర్థిక సహాయం అందజేసిన డాక్టర్ వన్నాల వెంకటరమణ**



**వరంగల్,20డిసెంబర్:తరంగాలు:** తండ్రిని కోల్పోయిన పేద విద్యార్థికి వ్యాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ వన్నాల వెంకటరమణ చేయూతనందించారు.వరంగల్ నగరానికి చెందిన మార్గం సత్యం అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురై తన కుమారుడు మార్గం చరణ్ పాఠశాల ఫీజు కొరకై సమైక్య వ్యాక్ ఫౌండేషన్ ను సంప్రదించారు.తన తల్లితో సహా మేనమామ ఇంటి వద్ద కేసముద్రంలో నివాసం ఉంటున్న విషయం తెలుసుకొని మనసు చలించిన వ్యాక్ సమైక్య ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ విద్యార్థి చదువుల నిమిత్తం పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉన్నత చదువుల్లో ఉత్తమమైన ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. డాక్టర్ వన్నాల వెంకటరమణ, సోదరుడు డాక్టర్ వన్నాల అరవింద్ కుమార్ స్థాపించిన సమైక్య వ్యాక్ ఫౌండేషన్ ద్వారా సుమారు 600 పై చిలుకు కుటుంబాలకు నెలకు 10 కిలోల బియ్యం,పలు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి,వారి కంటి చూపు కొరకు ఆపరేషన్లు చేయించడం జరిగిందన్నారు. అంతేకాకుండా తల్లిదండ్రులను కోల్పోయిన అనాధ పిల్లల చదువుల కొరకు ఆర్థిక సాయం, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని డాక్టర్ వన్నాల వెంకట రమణ తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్,ప్రధాన కార్యదర్శి భాగం హరిశంకర్,జిల్లా కార్యదర్శి గడల కుమార్, భారతీయ జనతా పార్టీ యువ మోర్చా నాయకులు అపురూప సాయి,తిలక్,చిలువేరు లక్ష్మణ్, నాగవల్లి మధు,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి





**-వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**

**-వరంగల్ పట్టణంలోని 18వ డివిజన్ లేబర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్**



**వరంగల్ ప్రతినిధి ,20 డిసెంబర్, తరంగాలు** ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని,లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్లో నమోదు చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సూచించారు.ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్లో నమోదు చేస్తున్నారు. శుక్రవారం వరంగల్ పట్టణంలోని 18వ డివిజన్ లేబర్ కాలనీ ప్రాంతంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఒక్క దరఖాస్తును వదలకుండా సర్వే చేయాలని ఆదేశించారు.సర్వేపై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని, ప్రజలు సైతం అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకొని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్‌లతో సహకరించాలని సూచించారు. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలు నమోదుకు ఎంత సమయం పడుతోంది.రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు.సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అధికారులను అడిగారు.ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్లు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని,తప్పిదాలకు తావులేకుండా వివరాలు సేకరించాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు సర్వే పారదర్శకంగా జరిగేలా సహకరించాలని కలెక్టర్ కోరారు.ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట కార్పొరేటర్ వస్కుల బాబు,జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి,జిడబ్ల్యూ ఎంసీ కాశిబుగ్గ సర్కిల్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు

# సైబర్ క్రైమ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-రూరల్ సీఐ సర్వయ్య... ఎస్సై మురళీధర్ రాజ్**






**కేసముద్రం , డిసెంబర్ 20,( తరంగాలు)** కేసముద్రం విలేజ్ లో సైబర్ క్రైమ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పాల్పడుతున్న వారిపట్ల చాలా జాగ్రత్త వహించాలని గోప్యంగా ఉంచాల్సిన విషయాలను బ్యాంకు లావాదేవీలను ఎవరికి సమాచారం ఇవ్వద్దని అన్నారు. నేడు సమాజంలో సైబర్ క్రైమ్ నేరగాళ్లు వివిధ రకాలుగా ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఇలాంటి వారికి అడ్డుకట్టు వేయాలంటే ప్రజలు అప్రమత్తంగా ఉంటే అడ్డుకట్టు వేయచ్చని మహబూబాబాద్ రూరల్ సీఐ ప్రజలకు వివరించారు. అనంతరం ఎస్సై మురళీధర్ రాజ్ మాట్లాడుతూ ప్రజలు వాహనదారులు రోడ్డు భద్రతలపై అవగాహన కలిగి ఉండాలని మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మీ మొబైల్ ఫోన్ చదువుకునే పిల్లలకు ఇవ్వద్దని ఆన్లైన్ గేమ్లు ఆడుతూ సైబర్ క్రైమ్ మోసాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని ప్రజలకు సూచించారు. సైబర్ క్రైమ్ మోసాలు ఎక్కువగా మొబైల్ ఫోన్ల ద్వారా జరుగుతున్నందున అపరిచితులు కాల్ చేసినప్పుడు బ్యాంకు వివరాలు ఎట్టి పరిస్థితుల్లో తెలియపరచవద్దని అలాగే మీ బంధువుల పేర్లతో ఫోన్లు చేస్తూ ఏదో విధంగా వివరాలు సేకరించే ప్రయత్నం చేసినప్పటికీ గోప్యంగా ఉంచాల్సిన వివరాలు ఎట్టి పరిస్థితుల్లో తెలియపరచవద్దని తెలిపారు. అలాగే దొంగల బారి నుండి మీ ఇల్లు దోపిడీకి పూరి కాకుండా పలు జాగ్రత్తలు వహించాలని పక్కవారికి సమాచారం ఇవ్వాలని ఇంట్లో విలువైన వస్తువులను డబ్బుని ఉంచరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, స్థానిక ఎస్సై మురళీధర్ రాజ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన వరుడిని ఆశీర్వదించిన పెద్ది




**నర్సంపేట డిసెంబర్ 20 తరంగాలు:** నర్సంపేట పట్టణానికి చెందిన సంకినేని జ్యోతి హనుమంతరావు ల కుమారుడు సంకినేని మణితేజ వివాహ కార్యక్రమంలో భాగంగా హల్ది వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి శుక్రవారం వరుడు మణితేజ ను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ వేడుకలో పెద్ది వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు పట్టణ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్ రెడ్డి , మున్సిపల్ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో టీజీ క్యాబ్ చైర్మన్ రవిందర్ రావు



**హైదరాబాద్,20డిసెంబర్,తరంగాలు:** తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవిందర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.అనంతరం టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవిందర్ రావు మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని,అదేవిదంగా ఏసుక్రీస్తు దీవెనలతో ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్ధించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీజీ క్యాబ్ సిజిఏం జ్యోతి,బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి ఖో ఖో లో కేసముద్రం మండలానికి ప్రథమ స్థానం



**కేసముద్రం,డిసెంబర్ 20, (తరంగాలు)** పల్లెల నుంచి ప్రపంచస్థాయి విజేతల కొరకు సీఎం కప్ అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్రీడలు నిర్వహించడం క్రీడా రంగానికి శుభ పరిణామం అని పీఈటి రాజేందర్ అన్నారు.సీఎం కప్ 2024 జిల్లా స్థాయిలో మహబూబాబాద్ లో జరుగుతున్న క్రీడ పోటీల సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలలో ఖో ఖో తుది పోరులో మహబూబాబాద్ రూరల్ మరియు కేసముద్రం మండలాల జట్లు తలపడగా ప్రథమ స్థానంలో కేసముద్రం జట్టు విజయం సాధించిందని తెలిపారు.ఇటీవల మండల స్థాయి క్రీడల సందర్భంగా కేసముద్రం మండల ఎంపీడీవో జే.క్రాంతి క్రీడాకారులకు,వ్యాయమ విద్య ఉపాధ్యాయులను ఎంతగానో ప్రోత్సహించి,క్రీడా దుస్తులు అందజేయడం జరిగిందని,అందుకు మండల వ్యాయామ విద్య ఉపాధ్యాయుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొప్పుల శంకర్,మల్ల విజయ చందర్,ప్రణయ్ ప్రభు,ఎస్ రవి,పద్మ,ఈ మధు,సరస్వతి,తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ గ్రామ సభ



**ఆలేరు ఆర్సీ, డిసెంబరు 20(తరంగాలు) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం లింగరాజ్ పల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం రోజు 14వ సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఏ లోకేశ్వర్ రెడ్డి , పంచాయతీ సెక్రెటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, సామాజిక తనిఖీ బృందం వారు పాల్గొనడం జరిగింది.

తరంగాలు Tharangalu Daily News Paper RNI . TELTEL / 2022 / 83463

# అక్రమ కేసులకు బీఆర్ఎస్ బెదరదు...

**-రేవంత్ రెడ్డి చేష్టలతో హైదరాబాద్ ప్రతిష్ట దిగజారింది...**

**-నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది...**

**నర్సంపేట డిసెంబర్ 20 తరంగాలు:** రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి రాక్షసానందం పొందుతోందని రేవంత్ రెడ్డి అక్రమ కేసులకు బెదిరేది లేదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నర్సంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేటీఆర్ పై అక్రమ కేసులు పెట్టి జైల్లో నిర్బంధించాలని చూస్తోందని ఈ కార్ రేస్ ద్వారా హైదరాబాద్ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా పెంచిన కేటీఆర్ పై అక్రమ కేసు పెట్టడం దుర్మార్గమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఐటీతో పాటు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ను పెంచారని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల పైన అక్రమ కేసులు పెట్టి జైల్లో నిర్బంధించాలని కుట్రతో పరిపాలన చేస్తున్నదని అన్నారు. ప్రజా పాలన చేస్తామని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసి ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రతిపక్ష పార్టీలపై కుట్ర రాజకీయాలు చేస్తుండడం విడ్డూరమన్నారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ సాంస్కృతి చరిత్ర పైన దాడి చేస్తుందని తెలంగాణ తల్లి రూపాన్ని, తెలంగాణ గేయాన్ని మార్చి తెలంగాణ ఉనికిని చరిత్రను మార్చే ప్రయత్నం చేస్తుండడం దుర్మార్గమన్నారు. తెలంగాణ వ్యతిరేకుల ఎజెండాతో రేవంత్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఫార్ములా ఈ రేస్ పైన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారం దేశ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ఉందన్నారు. ఈ రేసులో అవినీతి జరగలేదని స్వయంగా వారి మంత్రి చెబుతున్న కేవలం రూల్స్ వాయిలేషన్ మాత్రమే అంటున్నారు. దీనికి



ఏసీబీ కేసు ఎలా వర్తిస్తుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఈ రేస్ ఫార్ములా అంశం పైన అసెంబ్లీలో చర్చ పెట్టమంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు ఓటుకు నోటుతో పట్ట పగలు దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ నాయకులపై కుట్రపూరితంగా కక్షతో ఎన్ని అక్రమ కేసులు పెట్టినా న్యాయపరంగా ఎదుర్కొని పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన నర్సంపేట మున్సిపాలిటీకి స్థానిక ఎమ్మెల్యే తెచ్చిన నిధులు గుండు సున్నా అని దుమ్మెత్తి పోశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా తెచ్చిన అభివృద్ధి నిధులను పనులను ఆపివేసి టెండర్లను రద్దు చేశారని గెలిచిన ఎమ్మెల్యే కాంట్రాక్టర్ గా కొత్తగా టెండర్లు వేసి తాను తెచ్చిన నిధులనే అభివృద్ధి పనులుగా ప్రజలకు చూపిస్తుండడం సిగ్గుచేటు అన్నారు. టి యు ఎఫ్ ఐ డి సి నుండి తెచ్చిన 50 కోట్ల నిధుల పైన తప్పుడు ప్రచారం చేసి కోర్టుకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులు ఈరోజు ఏ ముఖంతో ఆ నిధులతో మేము అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నారని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఏడాది కాలంలో ఏ రోజైనా నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నిధులను కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చింది అని చెప్పే ధైర్యం కాంగ్రెస్ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు 6 కోట్ల నిధులతో నర్సంపేట మున్సిపాలిటీలో పాకాల ఆడిటోరియంను నిర్మిస్తే ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. మరో రూ.6 కోట్లతో మున్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను మంజూరు చేస్తే ఎందుకు పూర్తి చేయడం లేదన్నారు. శాశ్వత మంచినీటి పథకం కోసం అర్బన్ మిషన్ భగీరథ పథకం ద్వారా నిధులు తీసుకువచ్చామని పనులు ఎందుకు నిలిచిపోయాయని ప్రశ్నించారు. మెడికల్ కళాశాల జిల్లా హాస్పిటల్ నర్సింగ్ కళాశాలలను పట్టించుకునే దిక్కు లేదని వాటి అభివృద్ధిలో ఇప్పటివరకు పురోగతి లేదన్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒక్కరోజైనా స్థానిక ఎమ్మెల్యే కలిసి నర్సంపేట అభివృద్ధి పైన చర్చించారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మరియు ఎమ్మెల్యే మధ్య ఉన్న చిల్లర పంచాయతీతో నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధి ఆగిపోయిందన్నారు. తాను తెచ్చిన నిధులు దొంగ జీవోలు అని అన్న కాంగ్రెస్ నాయకులు మీ సొంత కంపెనీతో కాంట్రాక్టు పనులు ఎలా చేస్తున్నావని ప్రశ్నించారు. నియోజకవర్గం అభివృద్ధి పైన సమావేశం నిర్వహించాలని మీడియా మిత్రులను కోరారు. జర్నలిస్టులకు ఇండ్ల నిర్మాణం టెండర్లు ఎందుకు రద్దయ్యాయని ప్రభుత్వ భూముల అక్రమణ , భూ వివాదాలు, అవినీతి, పోలీస్ అక్రమ కేసులు ,అరాచకాలు పెరిగిపోయాయని అన్నారు. కోటి రూపాయల ప్రజాధనం వృధా చేసి ప్రజాసంఘాలకు ప్రజలకు ఉపయోగపడే ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ను క్యాంప్ ఆఫీస్ గా మార్చుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించడం ఆపకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని పెద్ది సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణ, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నామాల సత్యనారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు, జడ్పిటిసిలు , కౌన్సిలర్లు నియోజకవర్గ మరియు పట్టణ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క పేదోడికి ఇల్లు మంజూరు చేయలేదు

**-కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు**

**-సర్వేలో పాల్గొన్న ఇందిరమ్మ కమిటీ సభ్యులు**





**పరకాల,20డిసెంబర్, తరంగాలు:** అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని ఇందిరమ్మ కమిటీ సభ్యులు డాక్టర్ క్రాంతిజ్యోతి రజిని రుద్రమ, ఎండీ యాకుబ్ పాషా,వార్డు అధికారి శ్యామ్,బొజ్జ రాధిక లు అన్నారు.శుక్రవారం పట్టణంలోని ఐదవ వార్డులో ఎనమిదవ రోజు ఇందిరమ్మ ఇళ్ళ సర్వేలో భాగంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇళ్ళ సర్వే వివరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్క పేదవాడికి కూడా ఇల్లు మంజూరు చేయకపోగా నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లను సైతం రద్దు చేశారని అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇల్లు కట్టించేందుకు ఎస్సీ,ఎస్టీలకు ఆరు లక్షలు,బీసీ ఇతర సామాజిక వర్గాలకు ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు స్పష్టం చేశారు. అయితే ఇందిరమ్మ ఇళ్ళ సర్వే కోసం వచ్చే అధికారులకు గ్రామ ప్రజలు సహకరించి పూర్తి వివరాలు నమోదు చేపించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాజేష్,సాయి ముకేశ్,రోకండ్ల లక్ష్మణ్, వార్డు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# సుశ్రుత గ్రామీణ వైద్యులకు అవగాహన





**ఆలేరు ఆర్సీ, డిసెంబరు 20(తరంగాలు) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని వై బి ఆర్ ఫంక్షన్ హాల్ లో భువనగిరి పట్టణ కేంద్రానికి చెందిన ఆదిత్య హాస్పిటల్ , వినూత్న హాస్పిటల్ వైద్యులు సంయుక్తంగా సుశ్రుత గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు . సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షులు వంగ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫణీంద్ర బాబు , డాక్టర్ కళ్యాణ్ గ్రామీణ వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతూ వైద్యులు నరాలు , తలనొప్పి , మెదడు , వెన్నుముక , పక్షపాతం , ఫీట్స్ , తిమ్మిర్లు , మతి మరుపు , బొక్కల్లో కాల్షియమ్ తగ్గడం , ఆర్థోరూమటాయిడ్ నొప్పులు వీటి గురించి ఇవి ఎందుకు వస్తాయి అనే అంశం మీద సుశ్రుత గ్రామీణ వైద్యులకు క్లుప్తంగా వైద్యులు వివరించారు . ఈ సందర్భంగా సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షులు వంగ శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం గ్రామాలల్లో ప్రజలతో మమేకం అయి వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులకు ఆదిత్య హాస్పిటల్ , వినూత్న హాస్పిటల్ వారు ఇలాంటి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు . మీ అనుభవ పాఠాలను మాకు విపులంగా వివరించి ఇంకా ఎక్కువ జ్ఞానాన్ని అందించే ప్రయత్నం చేస్తున్న ఆదిత్య హాస్పిటల్ , వినూత్న హాస్పిటల్ వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫణీంద్ర బాబు , డాక్టర్ కళ్యాణ్ , సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి ఎల్ నారాయణ గౌడ్ , సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు సూదగాని లక్ష్మయ్య గౌడ్ , సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య , మండల కోశాధికారి గడ్డం అశోక్ , మండల ప్రచార కార్యదర్శి గుర్రం మల్లేష్ , మండల కార్యవర్గ సభ్యులు అంజిరెడ్డి , ఉపేందర్ , మచ్చగిరి , ఎల్లారెడ్డి , రవి కిరణ్ , శ్రీనివాస్ , దేవదాస్ , అచ్చయ్య , నాగరాజు , నరసింహ , ప్రసాద్ , శ్రీనివాస్ , అత్రి మహర్షి , బాల గంగాధర్ , నరేందర్ , శ్రవణ్ కుమార్ , లక్ష్మణ్ , ఆదిత్య హాస్పిటల్ , వినూత్న హాస్పిటల్స్ పి ఆర్ ఓ లు నవీన్ , వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు .

# క్షేత్ర పర్యటనలు పిల్లల జ్ఞాన సముపార్జనకు దోహదపడతాయి

**-ఎస్సై మురళీధర్ రాజ్**





**కేసముద్రం , డిసెంబర్ 20,( తరంగాలు)** శుక్రవారం కేసముద్రం విలేజ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను తహసిల్దార్ కార్యాలయం , మండల పరిషత్ కార్యాలయం మరియు స్థానిక పోలీస్ స్టేషన్ కు క్షేత్ర పర్యటనలో భాగంగా తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మురళీధర్ రాజ్ మాట్లాడుతూ పిల్లలు పట్టుదలతో చదివి మంచి ఉద్యోగం సంపాదించాలని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచిస్తూ, పోలీసులు శాంతి భద్రతలు కాపాడతారని ,సైబర్ క్రైమ్ లాంటి విషయాల్లో కూడా ప్రజలకు సేవలు అందిస్తారని వివరించారు.అలాగే తహసిల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సౌజన్య , మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధికారి హరిప్రసాద్ వారి ఆఫీస్ యొక్క విధులు ,వివిధ స్థాయి ఉద్యోగస్తుల గురించిసవివరంగా వివరించారు.ఈ క్షేత్ర పర్యటనలో పాఠశాల విద్యార్థులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్నా హరినాథ్, ఉపాధ్యాయుల గుండు సురేందర్, హేమలత లు పాల్గొన్నారు.

# తెలంగాణలో నిరసన తెలిపే హక్కు లేదా....

**-బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు...**

**నర్సంపేట డిసెంబర్ 20 తరంగాలు:** తెలంగాణ రాష్ట్రంలో ఆటో కార్మికులకు కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలుపడానికి పిలుపునిచ్చిన ఆటో యూనియన్ నాయకులు నవతెలంగాణ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందికొండ శ్రీను, గౌరవ సలహాదారులు మేడం వెంకటేశ్వర్లు, మాదన్నపేట అడ్డా అధ్యక్షుడు నరసయ్య, కరుణాకర్, సాయి ప్రేమ్ లను అక్రమంగా అరెస్టు చేయడం దారుణం అన్నారు. అరెస్టు అయిన




నాయకులను గోనె యువరాజు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా యువరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆటో కార్మికులకు జీవనభృతి కింద నెలకు 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. చనిపోయిన కార్మిక కుటుంబాలకు 50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ప్రతి ఆటో డ్రైవర్ కు నెలకు 12 వేల రూపాయల జీవనభృతి కల్పించాలని కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే లేబర్ శాఖ నుండి 5 లక్షల ఎక్స్ గ్రేషియా గత ప్రభుత్వంలో ఉండేదని కార్మికుని కాంట్రిబ్యూషన్ లేకుండానే ప్రభుత్వమే అట్టి డబ్బు ఇన్సూరెన్స్ కు చెల్లించి డ్రైవర్ కుటుంబానికి అండగా నిలబడ్డదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వా నుండి కట్టాల్సిన కాంట్రిబ్యూషన్ ఇప్పటివరకు చెల్లించలేదని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేసే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంటే అరెస్టులు చేయడం సరికాదని యువరాజు అన్నారు.

# ఇందిరమ్మ ఇంటి సర్వేను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి



**ఆలేరు ఆర్సీ, డిసెంబరు 20(తరంగాలు) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇంటి కుటుంబ సర్వేను శుక్రవారం రోజు మండల ప్రత్యేక అధికారి ఎం రాజారామ్ పరిశీలించారు. వీరితోపాటు మండల ఇంచార్జీ ఎంపిఓ,సూపరింటెండెంట్ ఏ లోకేశ్వర్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జనరంజన్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు పండిట్ మజ్జిగ బాలరాజుకు సన్మానం



**ఆలేరు ఆర్సీ, డిసెంబరు 20(తరంగాలు)** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం మోరిపిరాల మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఎస్సీ 2024 ద్వారా నూతనంగా ఎంపికైన తెలుగు పండిట్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మజ్జిగ బాలరాజుని గుండాల కాంప్లెక్సులో నిర్వహించిన టిపిటి ఉపాధ్యాయుల సమావేశంలో ఎంఈఓ మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సహ ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రేపటి తరానికి ఉన్నత విద్యను అందించే విధంగా కృషి చేయాలని అదేవిధంగా విద్యార్థులకు విద్యాతో పాటు సామాజిక మరియు సాంస్కృతిక విలువలను పెంపొందించే విధంగా బోధన చేయాలని సూచించారు.

## అడవి దేవులపల్లి మండలానికి బస్సులు పునరుద్ధరించాలని వినతి



**అడవిదేవులపల్లి,20డిసెంబర్,తరంగాలు:** అడవి దేవులపల్లి మండలానికి గతంలో ఉన్న నాలుగు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని మిర్యాలగూడ డిపో మేనేజర్ రామ్మోహన్ రెడ్డికి ఫ్రెండ్స్ ఫరెవర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ గతంలో నాలుగు బస్సులు నడిచేవని ఇప్పుడు ఒక్క బస్సు మాత్రమే మండల కేంద్రానికి వస్తుందని విచారం వ్యక్తం చేశారు గ్రామస్తులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు,గ్రామస్థులు ప్రయాణం కొనసాగించే విధంగా తిరిగి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఫ్రెండ్స్ ఫరెవర్ సభ్యులు కోరారు.

## అమిత్ షా చేసిన వాఖ్యలను ఉపసంహరించుకొని, క్షమాపణ చెప్పాలి



**చెన్నూర్, డిసెంబర్ 21. (తరంగాలు)** రాష్ట్రవ్యాప్తంగా పిలుపులో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్లాకార్డులతో కెపీపీఎస్. డివైఎఫ్ఐ. ఐద్వా. రైతు సంఘం. సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలు దేశ ప్రజల్ని అవమానించడమేనని అన్నారు. మనువాద రాజ్యాంగాన్ని అమలుచేసేందుకు బిజెపి ప్రయత్నాలు చేస్తుందని, ఇందుకు అమిత్ షా వ్యాఖ్యలే నిదర్శనమని అన్నారు. సామాజిక న్యాయం కోరుకునే వారందరికీ స్ఫూర్తి ప్రదాతైన డా. బిఆర్ అంబేద్కర్ ను అవమానించడం బిజెపి, ఆర్ ఎస్ఎస్ కు సంబంధించిన నాయకులు, మంత్రులుకు పరిపాటిగా మారిందన్నారు. బాధ్యతమైన హోదాలో ఉన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో అంబేద్కర్, అంబేద్కర్, అంటూ ఏలనగా చేసిన అమిత్ షా ను కేంద్ర మంత్రిగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దూర్కే మోహన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సంకే రవి, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సమాల ఉమారాణి యామిని, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే. ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలలో గెలుపోటములు సహజం







**-రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**నల్గొండ ఆర్సి, 20డిసెంబర్, తరంగాలు :** క్రీడలలో గెలుపోటములు సహజమని,ఓటమి విజయానికి నాంది కావాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్ఫూర్తినిచ్చారు. శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ పి ఎల్ క్రికెట్ మ్యాచ్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మనిషి అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని ,అందువల్ల ప్రతి ఒక్కరు బాగా కష్టపడి పని చేసి పైకి రావాలని పిలుపునిచ్చారు. ఎన్ జి కళాశాల మైదానాన్ని భవిష్యత్తులో అందరికీ అనుకూలంగా ఉండే విధంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. జిల్లా అభివృద్ధి లో భాగంగా ఎస్ఎల్ బిసీ కి 4000 కోట్ల రూపాయలను మంజూరు చేయించి టన్నెల్ తవ్వే మిషన్ బేరింగ్ ను అమెరికా నుండి తెప్పిస్తున్నామని,రెండు మూడు నెలల్లో బ్రాహ్మణ వెల్లేముల ప్రాజెక్టు ద్వారా నీళ్లు నింపి నల్గొండ పట్టణం సమీపంలోని చర్లపల్లి వరకు మీరు ఇస్తామని తెలిపారు. ఎం జి యూనివర్సిటీలో రెండు కొత్త బ్లాక్ లు నిర్మిస్తున్నామని, ఐటి టవర్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, లతీఫ్ సాబ్ గుట్టను 107 కోట్ల రూపాయలతో టూరిజం కేంద్రంగా మార్చేందుకు టెండర్లు పిలవడం జరిగిందని, రాబోయే నాలుగేళ్లలో నల్గొండను బంగారు కొండగా చేస్తానని తెలిపారు. నల్గొండ పట్టణంలో ప్రమాదాలను నివారించేందుకు, ట్రాఫిక్ జామ్ ను నియంత్రించేందుకు ఉద్దేశించి చేపట్టిన ఔటర్ రింగ్ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. అనంతరం మంత్రి రన్నర్స్ విన్నర్స్ కు ట్రోఫీలను అందజేశారు. కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన రక్తదాన శిబిరం లో 200 మంది రక్తాన్ని దానం చేసినట్లు మంత్రి తెలిపారు.

**-జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ**

ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూనే శారీరకంగా దృఢంగా ఉండాలని, ఆరోగ్యంతో పాటు ,చదువు పైన దృష్టి సారించాలని క్రీడాకారులతో కోరారు. గెలుపొందిన జట్లకు ఆమె అభినందనలు తెలిపారు.

**-జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ మాట్లాడుతూ**

క్రీడలు మనిషి జీవితంలో అతి ముఖ్యమని, ఓడినవారు, గెలిచినవారిని స్ఫూర్తిగా తీసుకొని ఆటలాడాలని పిలుపునిచ్చారు .జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా మిషన్ పరివర్తన తీసుకురావడం జరిగిందని, దీనికి అందరు సహకరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్మలమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో కలకలలాడుతున్న మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి పేరు



**పాలేరు ఆర్సీ. 20డిసెంబర్ (తరంగాలు).** కాసేపు రాజకీయాలను పక్కన పెడదాం.!ఇలా పాలేరు నియోజకవర్గంలో తిరుగుతూ స్థానికులతో మమేకమై వారి కష్టాలను, ఇబ్బందులను తెలుసుకున్న ఒక్క మంత్రిని గానీ, ఎమ్మెల్యేను గానీ ఇంత వరకూ చూడలేదు, కొంతమంది మాత్రం ఎన్నికల వేళ తిరగటం గుర్తుంది.!రాజకీయం.. అధికారం అంటే దోచుకోవటం మరియు దాచుకోవటం" అని ప్రజలు కూడా నమ్ముతున్న కాలంలో శ్రీ కందాళ ఉపేందర్ రెడ్డి లాంటి వారు రాజకీయాలను కొత్తగా రచిస్తున్నాడు.! కందాళ ఉపేందర్ రెడ్డి పనితనం చూసి ఇతను నిజమైన ప్రజా నాయకుడు అని ఘంటాపథంగా చెప్పచ్చు! ఎవరికైనా ఇంకేం రుజువులు కావాలి?అభిమానం పదవి ఉన్నా, లేకున్నా ,సహాయం అనడానికి నిదర్శనం ఆయనె మన కందాళమాటామంతి కష్టసుఖాల్లో పాలుపంచుకున్న వారు ఎప్పటికైనా ప్రజల గుండెల్లో చెదరని చిరస్థాయి ముద్ర. అధికారంలో ఉన్నా లేకున్నా అదే మాట అదే తీరు ఆయన పేరు తలుచుకుంటేనే చాలు ప్రజల గుండెల్లో నిగ్రహ శక్తి.పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ప్రతి పల్లెలో నిత్యం ప్రజల హృదయాల్లో నానుతూనే ఉన్నారు. అనడానికి నిదర్శనం ఈ దృశ్యం.లఎవరు అధికారంలో ఉన్నా గాని కసి పట్టుదలతో ప్రజాభిప్రాయం మేరకు పాలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. అందుకే పాలేరు నియోజకవర్గ ప్రజలు కందాళ ని మర్చిపోలేకపోతున్నారు. వారి స్మరణలోనే తేలి ఆడుతున్నారు కొందరు. పండుగల రోజున మాజీ తాజా పాలకులను స్మరించుకున్న ఘట్టాలు మధురస్మృతులు చిరస్థాయి ప్రతీకలుగా నిలిచిపోనున్నాయి. పాలేరు నియోజకవర్గం అంటేనే తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంపాలేరు నియోజకవర్గంలోని మాజీ పాలకులు వారి హాయంలో ప్రజలకు వారికి ఉన్న ఒక స్నేహపూర్వకమైన, ప్రేమానురాగాలతో కూడిన ఒకే కుటుంబ అనుబంధాల టైపు మరచిపోలేకపోతున్నారు అనడంలో సందేహం లేదు. వారు పదవిలో లేకున్నా గాని పాలేరు నియోజకవర్గం చుట్టే వారి ప్రాణం తిరుగుతుంది. అంటూ పురోహితులు రాజకీయ విశ్లేషకులు సీనియర్ పాత్రికేయులు ప్రతి ఒక్కరూ చర్చించుకోవడం అభినందనీయం. కులం లేదు. మతం లేదు. రాజకీయ పార్టీలు లేవు. అంతా మానవకులమే,

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరి గుడిసె దగ్ధం..

**-తన సొంత నిధులతో 2,5000/-లను ఆర్థిక సాయం అందచేసిన సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ మాలంపాటి...**




**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 20(తరంగాలు):** మిర్యాలగూడ పట్టణంలో గల గాంధీనగర్ లో శుక్రవారం విద్యుత్ షాక్ సర్క్యూట్ తో దాసరి స్వప్న భర్త సతీష్ దంపతులకు చెందిన పూరి గుడిసె పూర్తిగా దగ్ధం కావడంతో అందులో ఉన్న సామాన్లు పూర్తిగా కాలిపోవడం జరిగింది. ఈ సంఘటనపై విచారణ వ్యక్తం చేస్తూ వెంటనే స్పందించి వారికి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ మాలంపాటి మానవతా దృక్పథంతో వారి స్వంత నిధులతో 25,000 /-రూపాయలను ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ ఆర్థిక సాయం పై స్పందించిన బాధితులు సబ్ కలెక్టర్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. వీరితో పాటుగా అదే ప్రాంతంలోని కాలనీ వాసులు సబ్ కలెక్టర్ చేసిన ఆర్థిక సహాయానికి అభినందనలు తెలియజేయడం జరిగింది.

## 100 ఏళ్ల చరిత్ర గల కుటుంబంపై రాజకీయ కక్ష

**-రాయపూడి భవాని ప్రహరి కూల్చివేతపై వసుకుల మట్టయ్య ఆగ్రహం**




**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 20(తరంగాలు):** మిర్యాలగూడ పట్టణంలో రాయపూడి భవాని ప్రహరి కూల్చివేతపై ఎంసీపీఐ రాష్ట్ర నాయకులు వసుకుల మట్టయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన గంగాధర్ కుటుంబంపై రాజకీయ కక్ష సాధన జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇందిరమ్మ కాలనీలో తాళ్లగడ్డలో వందల ఎకరాల భూమి ఆక్రమణలను, దామరచర్లలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాలను అధికారులు పట్టించుకోకుండా, ఇక్కడ ఎలాంటి సమస్యలు లేని ప్రహరి కూల్చివేత జరగడం కక్షపూరిత చర్యగా మట్టయ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఈ పరిణామాలను పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. రాజకీయ కక్షలు, వేధింపులను నివారించాలని, ఇలాంటి కక్షపూరిత ధోరణిని మానుకోవాలని మట్టయ్య హెచ్చరించారు.

# జిల్లాలో విస్తృతంగా పర్యటించిన, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్





**-ఇందిరమ్మ ఇండ్ల సర్వే, పాఠశాలలు,వసతి గృహాలు ప్రధమ ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు,**



**కేసముద్రం, డిసెంబర్ 20,( తరంగాలు)** శుక్రవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ పాఠశాలలు, వసతి గృహాలు, మోడల్ స్కూల్స్, కలవల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం, ఇందిరమ్మ ఇండ్ల సర్వే కేసముద్రం మండలం, పెనుగొండ, బోడ మచ్చ తండలలో, లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పక్కగా నిర్వహించాలని అన్నారు, కేసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టిక మందుల స్టాక్ వివరాలు ఇన్ పేషెంట్ ఔట్ పేషెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ప్రతి రోజు షెడ్యూలు ప్రకారము వైద్య పరీక్షలు, శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని సూచించారు, సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలన్నారు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తున్న కిచెన్ గదిని స్వయంగా సందర్శించారు, పిల్లలకు నాణ్యమైన రుచికర భోజనం అందించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించదని తెలిపారు,తరగతి గదులలో పిల్లలతో మాట్లాడుతూ చదువుపై ఆసక్తితో ఉండాలని కేవలం విద్య ద్వారానే ఏదైనా సాధించవచ్చు అని విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు, పాఠశాల ఆవరణంలోని పరిసరాలను పరిశీలించారు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన డైట్ మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలని విద్యా, సానిటేషన్ వైద్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు, ప్రత్యేక అధికారులు సైతం క్షేత్రస్థాయిలో వసతి గృహాలు తనిఖీ చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు,ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్ రెడ్డి, సంబధిత శాఖల అధికారులు ఉన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీరెడ్డి



తొర్రూరు,20డిసెంబర్,తరంగాలు:
పుట్టినరోజు జరుపుకుంటున్న చిన్నారిని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఆశీర్వదించారు. శుక్రవారం తొర్రూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనుమాండ్ల నరేందర్ రెడ్డి మనవరాలు మొదటి జన్మదిన వేడుకలలు హుజురాబాద్ మండల కేంద్రంలో నిర్వహించగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్యా నాయిక్,తొర్రూరు పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్,శ్రీనివాస్ రెడ్డి, యాకూబ్ రెడ్డి,తదితరులు, ఉన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డిప్యూటీ డీఎం.అండ్ హెచ్ఓ



**రాయపర్తి,20 డిసెంబర్,తరంగాలు:**
రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన వర్ధన్నపేట డిప్యూటీ డిఎం అండ్ హెచ్ డాక్టర్.మోహన్ సింగ్ శుక్రవారం రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మరియు స్టాఫ్ తో మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలని,ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలని సమాజ ఆరోగ్య నిర్మాణానికి పాటుపడాలని తెలిపారు,రికార్డులను రిపోర్టులను %జూ%0చెక్ చేశారు.అన్ని జాతీయ ప్రోగ్రామ్స్ 100 శాతం రీచ్ కావాలని పర్ఫమెన్స్ పెంచేటట్టు చేయాలని స్టాఫ్,డాక్టర్ కు చెప్పారు.అనంతరం ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు,చలికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వేడి ఆహారం,సాయంత్రం 7 నుండి ఉదయం 8 గంటల వరకు పిల్లలు, వృద్ధులు బయటికి వెళ్లకూడదని చలి బాగా ఉందని,ఒకవేళ అత్యవసర పరిస్థితిలో వెళితే స్వేటర్ కానీ,వెచ్చని బట్టలు వేసుకొని వెళ్లాలని ప్రజలకు ఆరోగ్య అవసరాలను గుర్తు చేశారు. రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్.హారిక, సూపర్వైజర్ ఎం.భాగ్యలక్ష్మి,ఏ.ఎన్.ఎం.లు, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ను అవమానించడం దేశద్రోహమే

**-రాహుల్ గాంధీ పై భౌతిక దాడి చేయడం అత్యంత హేయమైన చర్య**
**- అమిత్ షా బే షరతుగా క్షమాపణ చెప్పాలి.**
**- కాంగ్రెస్ నాయకులు పెంద్ర అంజయ్య**



**పాలేరు ఆర్సీ.20డిసెంబర్ (తరంగాలు).** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మీద కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అవమానించడం బిజెపి అహంకార ధోరణికి పరాకాష్ట అని కూసుమంచి మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంద్ర అంజయ్య పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను దేశం మరిచిపోదు, సహించదని, వెంటనే బేషరతుగా దేశ ప్రజలందరికీ అమిత్ షా క్షమాపణలు చెప్పాలని పెంద్ర అంజయ్య డిమాండ్ చేశారు.అంబేద్కర్ అవమానించిన తీరుపై పార్లమెంట్ ఆవరణంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శాంతియుత మార్గంలో నిరసన తెలుపుతున్న క్రమంలో కొందరు బిజెపి ఎంపీలు పార్లమెంట్ భవనంలోకి రాహుల్ గాంధీ ని రానివ్వకుండా, భౌతిక దాడి చేయడం, బెదిరింపులకు పాల్పడడం మంచి పద్ధతే నా..? అని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికి సహించని చర్య కదా..?, బిజెపి ఎంపీలు రౌడీలు మాదిరిగా ప్రవర్తించడం మంచి పద్ధతేనా..? ఇది ప్రజాస్వామ్యం అవుతుందా..? ఇవి ప్రజాస్వామ్యానికి చీకటి రోజులు కావా..? అని అంజయ్య అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ కీర్తి ప్రతిష్టలు కాపాడడం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇలాంటి ఎన్ని అవమానాలు అయినా భరించడానికి రాహుల్ గాంధీ సిద్ధమని చెప్పడం కానీ. సగటు అంబేద్కర్ వాదికి ధైర్యాన్నిచ్చే అంశమని తెలిపారు. ఒంటెద్దు పోకడతో బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని, ఇది ముమ్మాటికి దేశ ప్రజలను అవమానించడమే అని అమిత్ షా నిరంకుశతత్వాని వీడి, హుందాతనంగా దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశ ప్రజలందరూ పురవీధుల్లో బహిరంగ నిరసనకు తెలియజేస్తామని హెచ్చరించారు.

# కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 20(తరంగాలు):**
మిర్యాలగూడ పట్టణంలో 35వ వార్డు గాంధీనగర్ కు చెందిన దాసరి సతీష్ ఇల్లు షార్ట్ సర్క్యూట్ అయ్యి దగ్ధం కావడం జరిగింది, దీనికి వెంటనే స్పందించిన కెవిపిఎస్ నాయకులు వారికి ఆర్థిక సాయం చేసి అలాగే దుప్పట్లు అందజేయడం జరిగింది. దీనిలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోడిరెక్క మల్లయ్య ?2000 ఆర్థిక సాయం చేయగా, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెముడాల పరుశురాములు దుప్పట్లను అందించడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ అత్యంత దళిత నిరుపేదలైన దాసరి సతీష్ ఇల్లు సామాన్లు మరియు దాదాపు 4,5 లక్షల నగదు బంగారు ఆభరణాలు దగ్ధం అయ్యాయని, వారి కుటుంబానికి ఇది కోలుకోలేని దెబ్బ అని వారు అన్నారు. దయా హృదయంతో మిర్యాలగూడలోని ప్రముఖులు, ప్రజాప్రతినిధులు దాసరి సతీష్ కుటుంబానికి ఆర్థిక మరియు వస్తువులు సహకారం దించాలని వారు కోరారు . అలాగే ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇల్లు మంజూరు చేసి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలి అని కోరారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు దైద దేవయ్య, తక్కెళ్ళపల్లి ఏసు బాబు, చిలుముల వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా కౌన్సిలర్ పడిగెల రేణుక ప్రదీప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు





**ఆలేరు ఆర్సీ, డిసెంబరు 20(తరంగాలు) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ ప్రభుత్వ బీచ్ మెహల్లా ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కుమారుడు కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా 23వ వార్డు కౌన్సిలర్ పడిగెల రేణుక ప్రదీప్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్ కౌన్సిలర్ పడిగెల రేణుక ప్రదీప్ పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించి మాట్లాడుతూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి వారి ఏకైక కుమారుడు ప్రతిక్ రెడ్డి మృతితో సర్వస్వాన్ని కోల్పోయి ఏకాకిగా అనేక రకాల మానసిక క్షోభ అనుభవించి రాష్ట్ర ప్రజలందరూ కూడా తన కుటుంబమే అని భావించి ప్రతి ఒక్క విద్యార్థిలో పేద ప్రజలలో తన కుమారున్ని చూసుకుంటూ తన కుమారుని పేరు మీద అనేక రకాల సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ముఖ్యంగా విద్యార్థులకు విద్యాపరమైన అంశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సొంతంగా కళాశాలల భవనాలను పాఠశాలలకు ఆర్థిక సహాయాలు ఉన్నత విద్య అభ్యసించే పేద విద్యార్థులకు ముఖ్యంగా డాక్టర్ ఇంజనీరింగ్ లాంటి ప్రొఫెషనల్ విద్యను అభ్యసించే పేద మధ్యతరగతి విద్యార్థులను వేల మందిని ఆదుకున్న చరిత్ర వారి సొంతమని వారు ముందు ముందు ఇలాగే అనేక రకాల సేవా కార్యక్రమాలు చేసుకుంటూ ఉన్నత పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాక్షించారు ప్రతి రెడ్డి మనందరి నుండి దూరం అవ్వడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ పచ్చళ్ల హేమలత జగన్మోహన్ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి పిట్టల బాలరాజ్ జువ్వాడి శ్రీధర్ డాకురి ప్రకాష్ గ్యాస్ చిన్న చుక్క స్వామి కాల్య నాగరాజు కాల్య స్వాతి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంగ ప్రవీణ్ ప్రధాన కార్యదర్శి ఏడుమేకల మహేష్ బర్రె నరేందర్ కసార బోయిన సాయి డొంకన భాస్కర్ సిరికొండ శివకుమార్ ఉడుత కార్తీక్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడి భాస్కర్ అధ్యాపక బృందం తదితరులు పాల్గొనడం జరిగింది.

# చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

-సంగెం మండల బిసి సంఘం అధ్యక్షులు వేల్పుల అనిల్ యాదవ్...



**తరంగాలు/సంగెం**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని బిసి సంక్షేమ సంఘం సంగెం మండల అధ్యక్షులు వేల్పుల అనిల్ యాదవ్ అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో క్రీ.శే.చిన్నపాక సుశీల-యాకయ్య,చిన్నపాక రాజు స్మారకార్థం వారి కుటుంబసభ్యులు చిన్నపాక చంద్రకళ-రాములు ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ షెటిల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.అనంతరం ఈ టోర్నమెంట్ లో విజేతలుగా నిలిచిన మొదటి బహుమతి వేల్పుల అఖిల్ యాదవ్-వర్కాల ప్రదీప్ టిమ్,రెండవ బహుమతి కోల్కనూరి రాజు-బాషబొయిన మణికంఠ టిమ్ ను పూలబొకే ఇచ్చి శాలువాలతో సన్మానం చేసి అభినందించారు.ఈ సందర్భంగా అనిల్ యాదవ్ మాట్లాడుతూ..ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడలకు అంతే ప్రాధాన్యత ఇవ్వాలని అప్పుడే జీవితంలో మరింత ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారని అన్నారు.అనంతరం ఈ కార్యక్రమం విజయవంతం కావడం కోసం కృషి చేసిన చిన్నపాక రాకేష్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు గన్ను శారద-సంపత్,మాదినెని రాంరెడ్డి,మాజీ ఉపసర్పంచ్ దబ్బేట సారంగపాణి, బిసి నాయకులు దబ్బేట రాజు,నాయకులు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు

# షార్ట్ సర్క్యూట్ తో పూరి గుడిసె దగ్ధం

-కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 20 (తరంగాలు):**
మిర్యాలగూడ పట్టణం 35వ వార్డు గాంధీనగర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరి గుడిసె పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.అతను కాలిపోయిన ఇంటిని పరిశీలించి, వారికి అన్ని విధాల సహాయం అందించేందుకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, తగిన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ముదిరెడ్డి నర్సిరెడ్డి, దేశి డి శేఖర్ రెడ్డి, డిసిసి జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలు, పట్టణ కాంగ్రెస్ నాయకుడు చిన్న పంగు శ్రవణ్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# మోసాలకు పాల్పడుతున్న జోగిపేట అమెజాన్ డెలివరీ సర్వీస్



**ఆందోల్,20డిసెంబర్, తరంగాలు:**
మోసాలు జోగిపేట అమెజాన్ డెలివరీ సర్వీస్ లో జరుగుతున్నాయని బాధితులు తెలిపారు. అందోల్ మండలంలోని జోగిపేట అమెజాన్ డెలివరీ సర్వీస్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ,డెలివరీ ఇవ్వకముందే ఐటెం డెలివరీ అంటూ యాప్ లో అప్లోడ్ చేస్తున్నారని,ఐటెం డెలివరీ కాక బాధితుడు దూదేకుల గౌసొద్దీన్ కస్టమర్ సర్వీస్ కు కాల్ చేయగా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారన్నారు.రేపు ఉదయం మీకు డెలివరీ ఇస్తామంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నారని, ఇప్పటికైనా ప్రజలు ఇలాంటి మోసాలు చేస్తున్న జోగిపేట అమెజాన్ డెలివరీ సర్వీస్ ఐటమ్ సక్రమంగా డెలివరీ చేస్తారని అమెజాన్ ని నమ్ముకొని ఐటం బుక్ చేస్తారు అలాంటప్పుడు ఇలా మోసాలు చేస్తున్న అమెజాన్ డెలివరీ బాయ్స్ అండ్ టీం ముందుగానే డబ్బులు చెల్లించిన కనీసం ఒక కాల్ కానీ ఒక ఎస్ఎంఎస్ గాని చేయకుండా ఇలా ఐటమ్ డెలివరీ అని వాట్సాప్ లో మెసేజ్ చూసుకొని కస్టమర్ సర్వీస్ కు కాల్ చేసిన బాధితుడు కస్టమర్ సర్వీస్ వారు పొంతనలేని సమాధానం చెబుతున్నారు.ఇలా డెలివరీ చేయకపోవడం పై బాధితుడు అమెజాన్ సర్వీస్ పై బాధితుడు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# జర్నలిస్టులందరికీ న్యాయం చేయండి

-ఇళ్ల స్థలాల కేటాయింపుల అవకతవకలపై విచారణ జరపండి

-సబ్ కలెక్టర్ కు వినతి చేసిన జర్నలిస్టులు



**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 20(తరంగాలు)**
మిర్యాలగూడ : రేయింబవళ్లు వార్త సేకరణలో పనిచేస్తూ.ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని, స్వార్థంతో కొందరికే లబ్ధి చేకూరేలా కొందరు చేస్తున్న వ్యవహారంపై, గతంలో ఇళ్ల స్థలాల కేటాయింపులు జరిగిన అవకతవకలపై పూర్తి విచారణ చేపట్టాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ కు జర్నలిస్టులు కొందరు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు సబ్ కలెక్టర్ తో మాట్లాడుతూ ప్రభుత్వం నుండి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు జరుపుతారు అంటూ గతంలో ఫీల్డ్ లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరినీ కూడేసిన కొందరు ఆ తర్వాత తమకు నచ్చిన వారిని లిస్టు గా తయారుచేసి కేవలం వారు మాత్రమే అర్హులన్నట్లుగా ఇటు అధికారులను అటు ఎమ్మెల్యేను మభ్యపెడుతూ నిజమైన అర్హులకు అన్యాయం జరిగేలా ప్రవర్తిస్తున్నారని దీనిపై పూర్తి విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. గతంలో ఒక పర్యాయం జర్నలిస్టు కోటాలో లబ్ధి పొందిన వారే తిరిగి మరోసారి లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో లబ్ధి పొందిన వారిలో సైతం భార్యలు ఉద్యోగులుగా ఉన్నవారు, రిటైర్డ్ ఉద్యోగులు జర్నలిస్టు పేరిట బిపిఎల్ కోటాలో ఇండ్ల స్థలాలు పొంది ఉన్నారని ఈ విషయం సమాచార హక్కు చట్టం ద్వారా తాము సేకరించిన లిస్టును సబ్ కలెక్టర్ కు అందజేశారు. గతంలో జరిగిన అవకతవక లపై కూడా విచారణ జరపాలని కోరారు. తిరిగి మరోసారి ఉద్యోగస్తుల కుటుంబీకులు, బిపిఎల్ పరిధిలోకి రానివారు జర్నలిస్టుల పేరిట ప్రభుత్వ ఇలస్థలాలను తీసుకునేందుకు సమాయత్తమవుతున్నారని ఈ విషయంపై విచారణ జరపాలని కోరారు. ఇదే విషయం పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని, న్యాయం జరగకపోతే లోకాయుక్తను ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలుగుబెల్లి వెంకట్, కే రాంప్రసాద్, కడమంచి నరసింహ, దైద రవి,వరకాల సురేష్,భరత్ తదితరులు ఉన్నారు.

# ఐటీఎం యూనివర్శిటి అడ్మిషన్ మీట్ 2025 - 26 కి ఆహ్వానం



**హన్మకొండ ప్రతినిధి డిసెంబర్ 20 (తరంగాలు)**
ఐ టీ ఎం యూనివర్సిటి 2025 - 26 అకడమిక్ సంవత్సరం కోసం అండర్ గ్రాడ్యుయేట్,పోస్ట్ గ్రాడ్యుయేట్,డాక్టోరల్ ప్రోగ్రామ్స్ కోసం అడ్మిషన్స్ ప్రకటించడం కోసం చాలా ఉత్సాహంగా కాంతివంతమైన మనస్సులను పెంపొందించే వారసత్వం కలిగిన ఐ టి ఎం యూనివర్సిటి, విద్యార్థులను తమ సంబంధిత రంగాలలో నాయకులుగా మారడానికి శక్తివంతమైన శిక్షణను అందిస్తుంది. అభ్యసించే విద్యార్థులు,నైపుణ్యం, ఆవిష్కరణ,నాయకత్వం కోసం రూపొందించిన వివిధ రంగాలలో ఉన్న అకడమిక్ కోర్సులను ఎంచుకోవచ్చని అడ్వకేట్స్ కాలనీ, హన్మకొండ,వరంగల్ బ్రాంచ్ ఆసక్తిగా ఎదురు చూస్తోందని అని సీఈఓ శ్రీ కృష్ణ ఈ సందర్భంగా తెలిపారు.గత 27 సంవత్సరాలుగా విద్యారంగంలో నెలకొని ఉందని ఐటిఎం అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ రవిశర్మ తెలిపారు.హనుమకొండ ఐటిఎం యూనివర్సిటీ సౌత్ ఇండియా అడ్మిషన్లలో భాగంగా స్మార్ట్ ఛాయస్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో వరంగల్ బ్రాంచ్ ను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటెక్ అగ్రికల్చర్ సైన్సెస్ 2025 - 26 అండర్ గ్రాడ్యుయేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టరల్ ప్రోగ్రామ్స్ అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య ఐటీఎంలో అందిస్తున్నట్లు పారదర్శకంగా విద్యార్థులకు విద్య అందిస్తున్న ఏకైక సంస్థ ఐటీఎం యూనివర్సిటీ అని గత 27 సంవత్సరాల నుండి అత్యుత్తమ ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు విద్యార్థులు భారతదేశం మొత్తం 4,000 మంది 27 సంవత్సరాలుగా వివిధ రంగాలలో ఉద్యోగాలు సాధించారని ఆయన తెలిపారు మా కళాశాల లో చదువుకున్న విద్యార్థులను అన్ని రంగాలలో క్యాంపస్ ప్లేస్మెంట్ ల ద్వారా ఎంపిక చేయబడ్డారు అదే విధంగా అకాడమిక్ కోర్సెస్ నూతన విద్యా విధానానికి అనుగుణంగా చక్కని విద్య ఇన్నోవేషన్ లీడర్షిప్ మొత్తంగా లీడర్షిప్ క్వాలిటీస్ తో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు ఆయన తెలిపారు

# పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

-ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలి

-అసాంఘిక కార్యకలాపాలు గంజాయి,జూదం,పి.డి.యస్ అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి, పటిష్టమైన చర్యలు

-ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు,సిబ్బంది పని చేయాలి

-జిల్లా ప్రజలకు ముందస్తు క్రిస్మస్,సంక్రాంతి శుభాకాంక్షలుతెలిపిన

-జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీస్






**నల్గొండ ఆర్సి, 20డిసెంబర్, తరంగాలు:**
పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని,పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీస్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని,పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సంవర్ధవంతమైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని అన్నారు. కమ్యునిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి లు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు.అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన,సత్వర సేవలు అందించాన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని,దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు.ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని తెలియజేశారు.రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని,ఓవర్ స్పీడ్,ట్రిపుల్ డ్రైవింగ్,మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, జూదం,పి.డి.యస్ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రిపీటెడ్ గా ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ ను నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్,నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి,మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు,దేవరకొండ డిఎస్పీ గిరిబాబు,సి.ఐ లు, ఎస్.ఐ లు తదితరులు పాల్గొన్నారు.

తరంగాలు
Tharangalu Daily News Paper
RNI : TELTEL / 2022 / 83463

# ఏపీజీవీబీ బ్యాంకులు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం

**-01జనవరి 2025 నుండి అమలు**

**-విలేకరుల సమావేశంలో చైర్మన్ ప్రతాపరెడ్డి వెల్లడి**



**హన్మకొండ ప్రతినిధి డిసెంబర్ 20 (తరంగాలు)**

ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ )లో ఉన్నటువంటి 493 బ్యాంక్ శాఖలను తెలంగాణ గ్రామీణ బ్యాంకు ( టి జి బి) లో విలీనం అవ్వనున్నట్లు బ్యాంకు చైర్మన్ ప్రతాపరెడ్డి అన్నారు. ఈ ప్రక్రియ 1 జనవరి 2025 నుండి అమలవుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు హనుమకొండలోని రీజనల్ ఆఫీసులో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ వన్ స్టేట్ వన్ ఆర్ ఆర్ బి లక్ష్యంలో భాగంగా భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం డి ఎఫ్ ఎస్ 13 -11 -2024 నాటి ఉత్తర్వు ద్వారా 2025 జనవరి 1 నుంచి ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో తలెత్తే సాంకేతిక సమస్యల కారణంగా తమ బ్రాంచ్ ఆపరేషన్ ఆన్లైన్ బ్యాంకింగ్ సర్వీసెస్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మొదలైనవి అన్ని కస్టమర్ సర్వీస్ సెంటర్లు లావాదేవీలు ఈనెల 28 నుండి 31 వరకు అందుబాటులో ఉండవని చైర్మన్ ప్రతాపరెడ్డి తెలిపారు వినియోగదారులు ఈనెల 27వ తేదీలోగా తమ లావాదేవీలను పూర్తి చేసుకోవాల్సిందిగా తెలిపారు.జనవరి 1 నుండి ఈ సర్వీసులు యధావిధిగా నడుస్తాయని ఖాతాదారుల ఖాతా నెంబర్లు అలాగే ఉంటాయని తెలిపారు.ఈ విషయంలో ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. హైదరాబాదులోని టీజీబి హెడ్ ఆఫీస్ కింద ఏపీజీవీబీ బ్రాంచ్లు పనిచేయనున్నట్లు వివరించారు.ఈ సమావేశంలో వి.దయాకర్,చైతన్య కుమార్,శశికాంత్,యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# బజాజ్ ఎలక్ట్రానిక్స్ మోసం-కస్టమర్ ఫిర్యాదు







**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 20 (తరంగాలు):**

మాయమాటలతో కస్టమర్లను మోసం చేస్తున్న నిర్వాహకులున్యాయం కోరితే బెదిరింపులు, పోలీసులకు ఫిర్యాదు చేసిన యువకుడుమిర్యాలగూడ పట్టణంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూం నిర్వాహకులు కస్టమర్లను మోసపూరిత మాయమాటలతో ఆకర్షిస్తూ వారి లక్ష్యాలను సాధించేందుకు అమాయకులను వలలోకి దింపుతున్నారు. ఆఫర్ల పేరుతో క్యాష్ బ్యాక్, ప్రొడక్షన్ ప్లాన్లు అంటూ వినియోగదారులపై ఒత్తిడి చేసి, మొబైల్ ఫోన్లకు తోడు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేయించేందుకు ప్రలోభపెడుతున్నారు.రెడ్డి కాలనీకి చెందిన యాదగిరి అనే వ్యక్తి జులై 14న బజాజ్ ఎలక్ట్రానిక్స్లో 80,500 రూపాయలకు ఐఫోన్ 15 ప్లస్ను కొనుగోలు చేశాడు. షోరూంలోని సిబ్బంది రెండు సంవత్సరాల ప్రొడక్షన్ ప్లాన్ తీసుకుంటే 70-80 శాతం క్యాష్ బ్యాక్ వస్తుందని చెప్పడంతో అతడు అదనంగా 15,900 రూపాయలు చెల్లించి ప్రొడక్షన్ ప్లాన్ను తీసుకున్నాడు.అయితే, ఈనెల 19న క్యాష్ బ్యాక్ కోసం షోరూం వెళ్లినప్పుడు పరిస్థితి మారింది. షోరూంను సంప్రదించగా క్యాష్ బ్యాక్ కేవలం ఆపిల్ మోడల్ వర్షన్ ఆపివేస్తేనే వర్తిస్తుందని చెప్పారు. దీంతో యాదగిరి షోరూం సిబ్బందిపై ప్రశ్నించగా వారు వెంటనే రౌడీలను పిలిపించి భౌతిక దాడికి పాల్పడడం, దుర్భాషలాడడం జరిగింది.మాయమాటలతో మోసం చేసిన బజాజ్ ఎలక్ట్రానిక్స్ నిర్వాహకుడు అమిత్పై చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలంటూ యాదగిరి మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

# ఫ్యాషన్ టెక్నాలజీ విద్యతో ప్లేస్మెంట్స్ అవకాశాలు




**హన్మకొండ ప్రతినిధి డిసెంబర్ 20 (తరంగాలు)**

ఫ్యాషన్ టెక్నాలజీ విద్య ద్వారా ప్లేస్మెంట్స్ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రొఫెసర్ శ్రీనివాస్ అన్నారు.ఈ మేరకు వరంగల్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ అనేది భారత ప్రభుత్వ టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఐఐటీలు మరియు ఐఐఎంల వంటి భారత పార్లమెంట్ చట్ట ప్రకారం ఏర్పాటు చేయబడిన ఒక ప్రధాన సంస్థ అని తెలిపారు.దీని కారణంగా సొంత ఐఐటి లు ఐఐఎంలు వంటి డిగ్రీలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.ఇది డిజైన్ మేనేజ్మెంట్ మరియు టెక్నాలజీ యొక్క ప్రీమియర్ ఇన్స్టిట్యూట్ గా ఉద్భవించినట్లు వివరించారు.అభివృద్ధి చెందుతున్న ప్రపంచ దృష్టాంతంలో ఫ్యాషన్ వ్యాపారంలో నాయకత్వ స్థానాలను చేపట్టడానికి నిపుణులను అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా నిఫ్ట్ 19 వృత్తిపరంగా నిర్వహించబడే కేంద్రాల నెట్వర్క్ ను కలిగి ఉన్నట్లు చెప్పారు.ఈ ఫ్యాషన్ టెక్నాలజీ హైదరాబాద్ లో జూలై 2025 నుండి విద్యా సంవత్సరానికి కావలసిన అడ్మిషన్లను ప్రారంభించనున్నట్లు శ్రీనివాస్ వివరించారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ఫ్యాషన్ డిజైన్ టెక్స్టైల్స్ డిజైన్ నీట్ వేర్ డిజైన్, లెదర్ డిజైన, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ టెక్నాలజీ వంటి డిజైన్, స్ట్రీమ్ లు అర్హులుగా పేర్కొన్నారు.ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్స్ గత నవంబర్ 20 నుండి ప్రారంభమై అయినయని చివరి తేదీ 6 జనవరి 2025 గా తెలియజేశారు.5000 అదనపు ఫీజు తో జనవరి 7 నుండి 9 వరకు ఉన్నట్లు వివరించారు. వ్రాత పరీక్ష ఫిబ్రవరి 9వ తారీకు ఉంటుందని సిచువేషన్ టెస్ట్ ఏప్రిల్ లో ఉంటుందని డిక్లరేషన్ ఆఫ్ ఫైనల్ రిజల్ట్ కూడా ఏప్రిల్ లోనే ఉంటుందన

# రాజ్యసభ లో అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రివర్యులు అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలి.

**కూసుమంచి మాల కమ్యూనిటీ ఆధ్వర్యంలో ర్యాలీ.**





**పాలేరు ఆర్సీ. 20డిసెంబర్ (తరంగాలు).**

కూసుమంచి . మండలం మాల కమ్యూనిటి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దామళ్ళ పాపారావు (టీచర్), D. వెంకన్న, చిన్న పాపారావు, హనుమంతు రావు, రామచంద్రు, రాజు, రమేష్, బొల్లెద్దు వెంకన్న, శానం ముత్తేశం, జ్యోతుల శివ, బద్దెపూడి వెంకన్న, చింతామళ్ళ నవీన్, కందుల అలివేలు, దామళ్ళ కమలమ్మ, లక్ష్మీకాంతమ్మ, సుజాత, సులోచన, వెంకటలక్ష్మి, గోలి రాంబాయిలు, కొండ జ్యోతి, శానం జ్యోతి, దార నాగమ్మ బొల్లెద్దు లక్ష్మి తదితరీలు పాల్గొన్నారు.....

# ప్రభుత్వ దవాఖానా సేవలు భేష్

**-ప్రజలు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలి**

**-ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ శ్రావణి**



**రాయపర్తి,20డిసెంబర్,తరంగాలు:**

ప్రభుత్వ దవాఖానలో సేవలు భేషుగ్గా జరుగుతున్నాయని ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ శ్రావణి అన్నారు. రాయపర్తి మండలం పీ.హెచ్.సి పరిధిలోని కొండూరు గ్రామంలో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని ఆ ప్రాంత డాక్టర్ శ్రావణి తెలిపారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానాలలో మెరుగైన వైద్యం అందివ్వడమే తమ ధ్యేయమని అన్నారు. రాయపర్తి మండలంలో కొండూరు పెద్ద గ్రామమని ప్రజలందరికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వైద్య సేవలను అందిస్తామని తెలిపారు.ఈ గ్రామానికి ఇరువైపులా ఉన్న గ్రామస్తులు కూడా ఇక్కడ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు ఇక్కడి ప్రజలు వైద్య సేవల నిమిత్తం కొంతమంది అర్హత లేని డాక్టర్లను సంప్రదిస్తున్నారని, తెలిసి తెలియని వైద్యం ద్వారా రోగులకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు.ఇప్పటికైన ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ దవాఖానలలో అత్యంత మెరుగైన వైద్య సేవలను పొంది ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిది.

**-తొర్రూరు ఏఎంసీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి.**

**-2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ.**



**తొర్రూరు 20 డిసెంబర్,తరంగాలు :**

ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిదని తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ (ఏఎంసి) హనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణ కేంద్రంలో మహా న్యూస్ టీవీ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఐజేయు జాతీయ కౌన్సిల్ మెంబర్ దూలం శ్రీనివాస్, మహా న్యూస్ ఛానల్ పాలకుర్తి నియోజకవర్గ ప్రతినిధి పంజాల శ్రీకాంత్ లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడమే కాకుండా ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి చేరవేయడంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిదని అన్నారు. పట్టణంతోపాటు మండలంలో ఏ సమస్య ఉన్న మా దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని... జర్నలిస్టులందరూ చిన్న సమస్య అయినా మా దృష్టికి తీసుకురావాలని జర్నలిస్టులకు సూచించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జర్నలిస్టులు నారాయణ రాజు, మెరుగు రమేష్, ప్రసాద్, యాకన్న, శ్రీకాంత్, సంతోష్, రవి, భాస్కర్, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

తరంగాలు
Tharangalu Daily News Paper

# అమిత్ షా ఖబడ్దార్

**-అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా పై మండిపడ్డ రంగారెడ్డి యూత్ కాంగ్రెస్**



**మహేశ్వరం నియోజకవర్గం 20 డిసెంబర్,తరంగాలు :** రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై పార్లమెంట్ లో అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బడంగ్పేట్ చౌరస్తా నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ చేపట్టి, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతో రాజకీయంగా లబ్ధి పొందుతూ బిజెపి నాయకులు అంబేద్కర్ను కించపరిచే విధనగా మాట్లాడడం సరైన పద్ధతి కాదని వారు మండిపడ్డారు. అమీత్ షా వెంటనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు బహిరంగ క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బడంగ్పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్ల గూడెం శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిగిరింత దయాసాగర్ రెడ్డి, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్, నాయకులు బాలశివుడు, దళపతి, సికిందర్, రవికాంత్, ఫాజిల్, రంజిత్, దీక్షిత్, శివ, సయ్యద్ అష్ఫల్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలి

**-సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం.**



**చెన్నారావుపేట, 20డిసెంబర్, తరంగాలు :** కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యసభలో అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు),తీవ్రంగా ఖండించింది .శుక్రవారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో సిపిఎం, పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పరికి మధుకర్ మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాలలో భారత రాజ్యాంగం పైజరుగుతున్న చర్చ సందర్భంగా అంబేద్కర్, అంబేద్కర్,అంబేద్కర్ అనే పేరు బదులు ఏదైనా దేవుని పేరు స్మరించండి మీకు పుణ్యం కలుగుతుంది, స్వర్గానికి వెళ్తారని అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమీషాను వెంటనే మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.ఆర్ఎస్ఎస్, మనువాద సిద్ధాంతాన్ని కడుపులో పెట్టుకొని ఎన్నికల సందర్భంలో అంబేద్కర్ సిద్ధాంతం గొప్పది, అంబేద్కర్ గొప్పవాడు అంటూ దళిత బహుజనల ఓట్ల కోసమే అని వారి అంతరాయం అర్థమైంది అని అన్నారు.అమిత్ షా చేసిన అనుచిత వాక్యాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా సమర్ధించడం సిగ్గుచేటు అని వారన్నారు.అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలు రాజ్యాధికారానికి దూరం అవుతున్నారని లక్ష్యంతో ఓటు హక్కును కల్పించి, రిజర్వేషన్లు కల్పించినటువంటి గొప్ప నాయకుడని, అటువంటి నాయకుడిని ఉచ్చరించవద్దని, దేవుణ్ణి స్మరించాలని చెప్పకనే చెప్పిన అమిత్ షాను వెంటనే మంత్రి పదవినుంచి తొలగించాలని అన్నారు. అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు.లేనియెల ఆందోళన,పోరాటాలు పెద్దఎత్తున నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నెక్కొండ ఏరియా కమిటీ సభ్యులు ఏనుగుతల నరేష్,జన్ను రమేష్,ఐలయ్య అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ నాయకులు జన్ను రవి,కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎండి బాష్మియా, నాయకులు తాటికాయల మధు, చిలపాక ప్రవీణ్, కుక్కల నవీన్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువును సర్వే చేయించి ఆక్రమణకు గురైన భూమిని స్వాధీన పరచుకోవాలి.

**-బీఆర్ఎస్ ఎస్టి సెల్ నాయకులు జాటోత్ సురేష్ నాయక్.**
**-ఎస్ఆర్ఎస్పి డి ఈ కార్యాలయంలో వినతి.**



**తొర్రూరు 20 డిసెంబర్,తరంగాలు :** తొర్రూరు పెద్ద చెరువును సర్వే చేయించి ఆక్రమణకు గురయిన భూమిని స్వాధీన పరుచుకోవాలని, మళ్లీ ఆక్రమణకు గురికాకుండా సరిహద్దులు ఏర్పాటు చేయాలని, ఆక్రమించి బిల్డింగులు నిర్మించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ ఎస్టీ సెల్ నాయకులు జాటోత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం తొర్రూరు పెద్ద చెరువు (ఊర చెరువు) ను సర్వే చేయించి ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఎస్సారెస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ నాయక్ మాట్లాడుతూ చెరువు విస్తీర్ణం ఎంతో సరిహద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణకు గురికాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ఇంతకుముందు చెరువు స్థలాన్ని ఆక్రమించి బిల్డింగులు నిర్మించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# రైస్ మిల్లులను తనిఖీ చేసిన

**-అడిషనల్ కలెక్టర్ జి సంధ్యారాణి**








**వరంగల్ ప్రతినిధి,20 డిసెంబర్,తరంగాలు :** అడిషనల్ కలెక్టర్ జి సంధ్యారాణి , డి సి ఎస్ ఓ కిష్టయ్య ,డి ఎం సివిల్ సప్లై అధికారిణి సంధ్యారాణి తో పాటు గీసిగొండ తహసిల్దార్ రియాజ్ లు మండలంలోని రైస్ మిల్లులను తనిఖీ చేశారు.ఇందులో భాగంగా మణికంఠ రైస్ ఇండస్ట్రీస్ మరియు ఈశ్వర ఇండస్ట్రీ తనిఖీ చేయడం జరిగింది. ఈ సంవత్సరం నాకు గాను ఖరీఫ్ 24- 25 సీజన్లో మణికంఠ ఇండస్ట్రీస్ 22,370 క్వింటాళ్లు మరియు ఈశ్వర ఇండస్ట్రీస్ గోరెకుంట 11,000 క్వింటాళ్ల వడ్లు దించుకోవడం జరిగింది.ఆయా మిల్లుల టాన్నేజి ప్రకారం వడ్లు దించుకోవాలని మరియు దించుకున్న వెంటనే ఓపిఎంఎస్ లో ఎంట్రీ చేసి అక్సెప్ట్ అయ్యేలా చూసి రైతులకు దాన్యం డబ్బులు పడే విధంగా చూడాలని ఆదేశించారు.అనంతరం గీసుకొండ మండలం మరియాపురం లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఎలా జరుగుతుందని ఆకస్మిక తనిఖీ చేసి సర్వ్ పనులను పరిశీలించారు.

# మిర్యాలగూడలో ఘోర రోడ్డు ప్రమాదం పదిమందికి తీవ్ర గాయాలు



**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 20(తరంగాలు):** తేది 20.12.2024 నాడు తెల్లవారుజామున అందాజ 02.30 గం.లపుడూ మిర్యాలగూడ బై పాస్ రోడ్ లో శరణ్య గ్రీన్ హెూమ్ దాటినంక భారత్ బెంజ్ షో రూం వద్ద కందుకూరు నుండి హైదరాబాద్ కి వెళ్ళుచున్న ప్రయివేట్ బస్ వేమూరి- కావేరి ట్రావెల్ బస్సు నెంబర్ వన్ ఎల్-01-బి-3017 లో సుమారు 33 మంది ప్రయాణిస్తున్న ప్రయాణికుల బస్ యొక్క బస్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపటం వలన బైపాస్ రోడ్ పక్కన గల కాలువ లోకి దూసుకెళ్లి ఒక బండ రాయికి డీ కొట్టడం వలన బస్సు లోని 10 మంది ప్రయాణికులకు గాయాలు అయినవి. గాయపడిన వారిలో 2 గురికి తలకు తీవ్రగాయాలు కాగా,మిగిలిన 8 గురికీ సాధారణ గాయాలు అయినవి. గాయపడిన వారు హైదరాబాద్ లోని హాస్పిటల్స్ నందు ట్రీట్మెంట్ నడుస్తుంది.నిర్లక్ష్యంగా నడిపిన బస్సు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ టూ టౌన్ ఇన్స్పెక్టర్ నాగర్జున తెలిపారు.

# రేవంత్ సర్కార్ తోనే నిరుపేదల సొంతింటి కల సాధ్యం





**-కట్ర్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి సతీష్**



**వర్ధన్నపేట ప్రతినిధి ,20డిసెంబర్,తరంగాలు:** నిరుపేదల సొంతింటి కల సకారం రేవంత్ సర్కార్ తోనే సాధ్యమని కట్ర్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి సతీష్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా శుక్రవారం వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశానుసారం ఇందిరమ్మ కమిటీ సభ్యులు అధికారులతో కలిసి సర్వే చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు ప్రజాపాలనలో సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా గ్రామ అధికారి ఇందిరమ్మ యాప్ ద్వారా సర్వే చేపట్టడం జరుగుతుందని, ఇందిరమ్మ పథకం కింద పూర్తిస్థాయి అర్హత గల నిరుపేద కుటుంబాలకు ఇళ్లను అందజేసే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.గ్రామంలోని ఇల్లు లేని పేదలు ఇంటి పన్ను,నల్ల పన్ను,కరెంట్ బిల్లు,ఇంటి స్థలం పేపర్లు తగిన వివరాలు అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుజ్జ రవిందర్ రెడ్డి, తీగల సునీత,మహ్మద్ అక్బర్, నాంపల్లి రమ రవిందర్, తాటికాయల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

https://www.tharangalu.com/e-paper

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

## విలేకర్లు కావలెను

మహబూబాబాద్, కురవి,డోర్నకల్, గూడూర్, కొత్తగూడ, చిన్నగూడూర్,నెల్లికుదురు, మరిపెడ, నర్సిహుల పేట, పెద్దావంగర, బయ్యారం, గార్ల, దంతాలపల్లి, గంగారం, ఇనుగుర్తి, సీరోల్ మండలాల లో తరంగాలు జాతీయ దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను.



https://www.tharangalu.com /e-paper

9494923460

జాతీయ దిన పత్రిక

తరంగాలు

Tharangalu Daily News Paper ప్రతి అక్షరం... సామాన్యుడి అస్త్రం...


ఎడిటర్ & చైర్మన్ గడ్డం నాగరాజు

MOVIES TIME
శనివారం 21 ,డిసెంబర్ 2024
తరంగాలు
Tharangalu Daily News Paper



# మరో ఇంట్రెస్టింగ్ సినిమాతో రానున్న అనుపమ..

అందాల భామ అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం ఆచి తూచి సినిమాలు చేస్తుంది. హీరోయిన్ గా ఒకొక్క పెట్టు ఎక్కుతూ వస్తున్న అనుపమ పరమేశ్వరన్ కెరీర్ బిగినింగ్ లో గ్రామర్స్ రోల్స్ కు దూరంగా ఉంటూ వచ్చింది. కానీ ఆతర్వాత టిల్లు స్క్వేర్ సినిమాలో మాత్రం తన అందాలతో ఆకట్టుకుంది. ఓ రేంజ్ లో అందరు ఆరబోసి అభిమానులను కవ్వించింది ఈ కుర్రది. ఇక ఈ అమ్మడు కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీస్ తోనూ ఆకట్టుకుంటుంది. ఎక్కువగా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎంచుకుంటుంది ఈ అమ్మడు. తాజాగా అనుపమ మరో ఇంట్రెస్టింగ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది.సూపర్ స్టార్ సురేష్ గోపి అనుపమ పరమేశ్వరన్ ముఖ్య పాత్రల్లో కాస్మోస్ ఎంటర్టైన్మెంట్స్ పై జె. ఫణీంద్ర కుమార్ నిర్మాతగా ప్రవీణ్ నారాయణ దర్శకత్వంలో వస్తున్న యదార్థ సంఘటనల ఆధారంగా వాస్తవిక దృక్పధ కోణంలో తీసిన సినిమా జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (జె. ఎస్. కె). బైజు సందోష్, మాధవ్ సురేష్ గోపి, దివ్య పిళ్లయి, అస్కర్ అలీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఇంటెన్స్ కోర్టు డ్రామాగా ఈ చిత్రాన్ని నిర్మించారు.అనుపమ పరమేశ్వరన్ సినిమాలో జానకి పాత్రలో నటిస్తోంది. యదార్థ సంఘటన ఆధారంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో జానకి పై జరిగిన అన్యాయాన్ని కోర్టులో ఎలా ఎదుర్కొంది అన్న అంశాన్ని ఇంటెన్స్ డ్రామాగా నిర్మించారు. ఈ కేసును వాదించే లాయర్ పాత్రలో సూపర్ స్టార్ సురేష్ గోపి గారు నటించారు. ఈ సినిమాని ఫిబ్రవరిలో విడుదల చేస్తామని మూవీ మేకర్స్ తెలిపారు




# పుష్ప 2 ది రూల్ రికార్డు వసూళ్లు .!

భారీ అంచనాల మధ్య విడుదలై ఎప్పటిలాగే సౌత్‌తోపాటు నార్తిండియన్ ప్రేక్షకులను ఫిదా చేస్తున్నాడు పుష్పరాజ్. ఐకాన్ అల్లు అర్జున్ సీక్వెల్ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ డిసెంబర్ 5న వరల్డ్‌వైడ్‌గా థియేటర్లలోకి వచ్చి రికార్డు వసూళ్లతో ట్రెండింగ్ టాపిక్‌గా నిలుస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై న పుష్ప 2 ది రూల్ ఓపెనింగ్ డేనే జవాన్, ఆర్‌ఆర్‌ఆర్ రికార్డును బద్దలు కొట్టిందని తెలిసిందే. తాజా కలెక్షన్ల రిపోర్ట్‌తో పుష్పరాజ్ మేనియా ఎలా ఉందో అర్థమవుతోంది.పుష్పరాజ్ ఏ మాత్రం తగ్గేదేలే అంటున్నారు. 15 రోజుల్లోనే రూ.1508 కోట్లు వసూళ్లు రాబట్టి అత్యధిక వేగంగా ఈ మార్క్ చేరుకున్న చిత్రంగా అరుదైన ఫీట్ నమోదు చేసింది. ఇప్పటివరకు ఆల్ టైమ్ హయ్యెస్ట్ గ్రాస్ ఇండియన్ మూవీస్ అమీర్ ఖాన్ దంగల్ (రూ.2070. 30 కోట్లు), బాహుబలి.. ది కంక్లూజన్ (రూ.1786.06 కోట్లు) పేర్లతో ఉన్న రికార్డ్‌ను పుష్ప 2 ది రూల్ అధిగమించడం ఖాయమని తాజా కలెక్షన్లు చెప్పకనే చెబుతున్నాయి. పుష్ప 2 మరికొన్ని రోజుల్లోనే ఈ ఫీట్ చేరుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రం కన్నడ సోయగం రష్మిక మందన్నా మరోసారి శ్రీవల్లిగా ఇంప్రెస్ చేసింది. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు.



# కీర్తి సురేష్ డెడికేషన్‌కు ఫిదా కావాల్సిందే..!

కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ అంటే కేవలం ఆరు పాటలు నాలుగు సీన్స్ కు మాత్రమే పరిమితం అన్నట్టుగా ఉండేది ఇన్నాళ్లు పరిస్థితి. కానీ ఇప్పుడు సీన్ మారింది. స్టార్ హీరోయిన్లు కమర్షియల్ సినిమాల్లోనూ తమ మార్క్ చూపించేందుకు కష్టపడుతున్నారు. గ్లామర్ తో పాటు నటనకు కూడా స్కోప్ ఉండే రోల్స్ ను ఏరి కోరి సెలెక్ట్ చేసుకుంటున్నారు. కేవలం సినిమాలో నటించటం వరకే కాదు ఆ సినిమాల ప్రమోషన్ బాధ్యతలను కూడా నెత్తికెత్తు కుంటున్నారు. తమ పర్సనల్ లైఫ్ ఎఫెక్ట్ ఏ మాత్రం సినిమాల మీద పడకుండా చూసుకుంటున్నారు. అందుకే కోసం రిస్క్ చేసేందుకు కూడా రెడీ అంటున్నారు.రీసెంట్ గా పెళ్లి చేసుకొని ఫ్యామిలీ లైఫ్ లోకి ఎంటర్ అయిన కీర్తి సురేష్.. వారం రోజులు కూడా తిరక్కుండానే సినిమా పనులు స్టార్ట్ చేశారు. తన బాలీవుడ్ డెబ్యూ మూవీ బేబీ జాన్ ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. నార్త్ మూవీ కావటంతో ఆ సినిమా కంటెంట్ కు తగ్గట్టుగా హాట్ లుక్స్ తో కనిపిస్తూనే మన సాంప్రదాయం పట్ల తనకున్న గౌరవాన్ని కూడా చూపిస్తున్నారు కీర్తి. బేబీ జాన్ ప్రమోషన్స్ లో మెడలో పసుపు తాడుతోనే కనిపిస్తున్నారు ఈ బ్యూటీ.



# హాట్ ఫొటోలతో హీట్ ఎక్కిస్తోన్న టీమిండియా క్రికెటర్ భార్య..

టీమిండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్ భార్య ధనశ్రీ వర్మ మల్టీపుల్ ట్యాలెంటెడ్. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా రాణిస్తున్న ధనశ్రీ డెంటిస్ట్, కొరియోగ్రాఫర్‌గా తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.యూట్యూబర్ గా కెరీర్ ప్రారంభించిన ఆమె పలు బాలీవుడ్ టీవీ రియాలిటీ షోస్ లోనూ పాల్గొంది. ఇక అందంలో స్టార్ హీరోయిన్లకు ఏ మాత్రం తక్కువకాదీ ముద్దుగుమ్మ.ఎనర్జిటిక్ డ్యాన్సర్ గా పేరున్న ధన శ్రీ వర్మ త్వరలోనే టాలీవుడ్ హీరోయిన్ గా ఎంట్రీ ఇస్తుందని ఈ మధ్యన తెగ ప్రచారం జరుగుతోంది.ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, ఢీ ఫేమ్ యష్ హీరో గా నటిస్తోన్న ఓ సినిమాలో ధన శ్రీ వర్మ కథానాయికగా కనిపించనుందని వార్తలు వినిపిస్తున్నాయి.ఈ క్రమంలో ధన శ్రీ వర్మ తాజాగా షేర్ చేసిన కొన్ని ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఇందులో బ్లాక్ కలర్ ఔట్ ఫిట్ లో కనిపిస్తూ నెటిజన్ల మతిపోగోడుతోందీ అందాల తార.

Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com